## యోగాతో ఆరోగ్య జీవనం

అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సన్నాహకాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు అట్టహాసంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను అధికార యంత్రాంగం చేపట్టింది. యోగాంధ్ర-25 పేరుతో మాసోత్సవాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా శనివారం స్థానిక ప్రకాశం భవన్ ఎదురు ఉన్న రోడ్డులో కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి పలువురు అధికారులు ఆసనాలు సాధన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను జీవన విధానంలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. జిల్లాలో పది లక్షల మందికి యోగా సాధనపై అవగాహన కల్పించేలా అన్ని ప్రాంతాల్లోనూ రోజుకో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

- వివరాలు 7వ పేజీలో..





ఎస్ఐ శ్రీకాంత్

## ఎన్‌జీపాడు ఎస్ఐపై అవినీతి ఆరోపణలు!

- సెలవుపై వెళ్లిన శ్రీకాంత్
- రజియాసుల్తానా నియామకం?


నాగులుప్పలపాడు, మే 24 : నాగులుప్పలపాడు ఎస్ఐ శ్రీకాంత్‌పై అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయన సెలవుపై వెళ్లినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో షేక్ రజియాసుల్తానాను ఇక్కడ నియమించినట్లు సమాచారం. ఇటీవల నాగులుప్పలపాడులోని అంకమ్మతల్లి కొలుపుల సందర్భంగా రెండువర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ ఓ వర్గానికి అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలు వచ్చాయి. పోతవరం గ్రామానికి చెందిన ఇరువర్గాల మధ్య జీవాలు మేపుకునే విషయంలో తలెత్తిన వివాదంలో ఓ వర్గం నుంచి పెద్దఎత్తున నగదు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక బి.నిడమానూరు గ్రామంలో జరిగిన వివాదంలోనూ శ్రీకాంత్ భారీ మొత్తంలో వసూలు చేసి ఓ వర్గానికి అనుకూలంగా వ్యవహరించినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. అలాగే రేషన్ మాఫియాను నడిపిస్తున్న ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు కాగా, అతని వద్ద నుంచి పెద్దఎత్తున వసూలు చేసి అరెస్టు చేయకుండా తప్పించారన్న అభియోగం కూడా ఉంది. మూడు రోజుల క్రితం అదే వ్యక్తిపై నమోదైన గంజాయి కేసు విషయంలోనూ భారీగా దండుకున్నట్లు తెలుస్తోంది. ఎస్ఐ శ్రీకాంత్ అవినీతి బాగోతాన్ని సదరు రేషన్ మాఫియా నిర్వహిస్తున్న వ్యక్తే ఒంగోలులోని ఓ పోలీసు ఉన్నతాధికారి వద్ద వివరించినట్లు తెలిసింది. దీంతో విషయం ఎస్పీ దామోదర్ దృష్టికి వెళ్లింది. ఆయన తన కార్యాలయానికి పిలిపించుకొని శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఈక్రమంలో శ్రీకాంత్ ఆరోగ్య సమస్యను చూపుతూ దీర్ఘకాలిక సెలవుపెట్టి వెళ్లినట్లు తెలుస్తోంది. ఆయన స్థానంలో ఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న షేక్ రజియా సుల్తానా ఆదివారం బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

## తాగునీటికే సాగర్ జలాలు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు



ఒంగోలు కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి) : సాగర్ కుడికాలువ ద్వారా విడుదల చేసిన నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దిశగా పర్యవేక్షించేందుకు రెవెన్యూ, పోలీస్, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, మునిసిపల్, జలవనరుల శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను నియమించినట్లు వెల్లడించారు. ప్రాజెక్టు నుంచి ఈనెల 23న నాలుగు టీఎంసీల నీటిని విడుదల చేశారన్నారు. దాన్ని పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలు వినియోగించుకోవాల్సి ఉందన్నారు. ఈనేపథ్యంలో వ్యవసాయ అవసరాలకు కాకుండా ట్యాంకులు, ఇతర తాగునీటి వనరులను నింపాలని కలెక్టర్ ఆదేశించారు. కాలువ గట్లపై గస్తీని ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.



# కరోనాపై అప్రమత్తం

**ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యశాఖకు ప్రభుత్వ ఆదేశం**

### ఇప్పటికే దిశానిర్దేశం చేసిన అధికారులు

**కరోనా మహమ్మారి మళ్లీ భయపెడుతోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కొవిడ్-19 మార్గదర్శకాలను జారీచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రప్రభుత్వం కూడా వైద్యశాఖను అప్రమత్తం చేసింది. ప్రస్తుతం విశాఖపట్నం, కడపల్లో కరోనా పాజిటివ్ కేసులు నమోదు కావడంతో వైద్యారోగ్యశాఖ అధికారులు తగిన చర్యలకు సిద్ధమయ్యారు. ప్రజలు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై దిశానిర్దేశం చేస్తున్నారు. మరోవైపు వైద్యులను అలర్ట్ చేయడంతోపాటు ప్రైవేటు వైద్యశాలల ప్రతినిధులతో కూడా కాన్ఫరెన్స్‌లు నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో కొవిడ్ నిబంధనలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా వైద్యసిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు.**

- త్వరలో టెస్టులు చేసేందుకు అందుబాటులోకి కిట్లు
- ప్రైవేటు వైద్యశాలల ప్రతినిధులతోనూ చర్చలు
- లక్షణాలు సాధారణమే అంటున్న వైద్యులు

ఒంగోలు కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కరోనా కేసులు నమోదవుతుండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. వైద్యారోగ్యశాఖను అలర్ట్ చేసింది. ప్రధానంగా ఆలయాలు, బస్టాండులు, రైల్వేస్టేషన్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రజలకు గతంలో మాదిరిగా మాస్కులు ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అందుకు అనుగుణంగా జిల్లా వైద్యారోగ్యశాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఈ విషయంపై డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తగిన సూచనలు చేశారు.

**ప్రభుత్వ మార్గదర్శకాలు ఇవీ**

- సామూహిక ప్రార్థనలు, సామాజిక సమావేశాలు, పార్టీలు, జనం ఒకచోట చేరే కార్యక్రమాలను నిలుపుదల చేయాలి.
- రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాలలో కొవిడ్ మార్గదర్శకాలను అనుసరించాలి
- వృద్ధులు (60 ఏళ్ల పైబడిన వారు), గర్భిణులు ఇంటి లోపలే ఉండాలి
- పరిశుభ్రత పాటించడంతోపాటు క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవాలి. దగ్గు, తుమ్ములు వచ్చినప్పుడు ముఖాన్ని తాకకుండా చూసుకోవాలి
- అధిక ప్రమాదకర ప్రాంతాల్లో మాస్కులు ధరించాలి. రద్దీగా ఉండే లేదా సరిగా వెంటిలేషన్ లేని ప్రదేశంలో ఉంటే మాస్క్ ధరించడం వల్ల వైరస్ వ్యాప్తిని తగ్గించొచ్చు.
- కొవిడ్ లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలి.
- కరోనా లక్షణాలు వ్యక్తిని బట్టి మారుతూ ఉంటాయి. జ్వరం లేదా చలి, దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి లేదా వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాలు లేదా శరీర నొప్పులు, ముక్కు కారడం లేదా ముక్కుదిబ్బడ, వికారం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు ఉంటాయి. ఇలాంటివి ఉంటే నిర్ధారణకోసం సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలి.

**త్వరలో కిట్లు రాక**

రాష్ట్రంలో చాపకింద నీరులా కేసులు నమోదవుతుండటంతో టెస్టులకు అవసరమైన కిట్లను ప్రభుత్వం త్వరలో జిల్లాలకు పంపనున్నట్లు సమాచారం. ప్రధానంగా జ్వరం, జలుబు, దగ్గు ఉంటే అటువంటి వారిని వారంరోజులపాటు హోం క్వారంటైన్‌లో ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించింది. అప్పటికీ జ్వరం, తగ్గు, జలుబు తగ్గకపోతే వారికి వెంటనే కరోనా టెస్టు చేసి సమీపంలోని ఏరియా వైద్యశాలకు తరలించాలని సూచించింది. ఇందుకు సంబంధించి ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించే విధంగా వైద్యశాఖ కరపత్రాలను కూడా ప్రచురించి పంపిణీ చేయనుంది.



ఆర్డీవోకు మ్యాప్ ద్వారా ప్రభుత్వ భూముల వివరాలను తెలుపుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

## సోలార్ ప్రాజెక్టుకు ప్రభుత్వ భూముల పరిశీలన

దొనకొండ, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు నిమిత్తం ఎంపిక చేసిన ప్రభుత్వ భూములను శనివారం కనిగిరి ఇన్‌చార్జి ఆర్డీవో శివరామిరెడ్డి పరిశీలించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ మండలంలోని రుద్రసముద్రం, బాదాపురం, రాగమక్కపల్లి రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను చూపించారు. వాటికి హద్దులు, ఇతరత్రా వివరాలను మ్యాపుల ద్వారా ఆర్డీవోకు వివరించారు. అనంతరం వారు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వో మాచర్ల, సర్వేయర్ మస్తాన్, లైసెన్స్ సర్వేయర్ చెన్నంశెట్టి వెంకటరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఒంగోలులోని తన కార్యాలయంలో ఉపాధ్యాయుల బదిలీల దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంఈవో కిషోర్‌బాబు

## టీచర్ల బదిలీలకు 4,652 దరఖాస్తులు

### స్కూల్ అసిస్టెంట్‌లకు నేడు కూడా అవకాశం

- ప్రారంభమైన పరిశీలన
- మొదటి దశలో ఎంఈవోలు
- జిల్లా స్థాయిలో 11 బృందాలు ఏర్పాటు

**ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి శనివారం సాయంత్రానికి 4,652 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే గ్రేడ్ టూ ప్రధానోపాధ్యాయులకు దరఖాస్తు గడువు ముగిసింది. స్కూల్ అసిస్టెంట్‌లు, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు శనివారం రాత్రికి ముగియాల్సి ఉంది. అయితే సాఫ్ట్‌వేర్ లోపంతో దొర్లిన తప్పులు సరికాకపోవడంతో ఆదివారం కూడా దరఖాస్తుకు అవకాశం కల్పించారు.**

ఒంగోలు విద్య, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బదిలీల దరఖాస్తుల పరిశీలన ప్రారంభమైంది. హెచ్‌ఎంల బదిలీల దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. శనివారం రాత్రికి వారి ప్రాథమిక సీనియారిటీ జాబితా విడుదలకానుంది. స్కూల్ అసిస్టెంట్ల బదిలీలకు దరఖాస్తు గడువు మరో రోజు పొడిగించారు. అయినప్పటికీ మొదటి దశ పరిశీలన ప్రక్రియను మండల విద్యాధికారులు చేపట్టారు. వాస్తవానికి హైస్కూళ్లలో పనిచేస్తున్న ఎస్ఏల దరఖాస్తుల పరిశీలన ఉప విద్యాధికారులు చేయాల్సి ఉంది. అయితే వేలసంఖ్యలో వస్తుండటంతో మొదటి దశ పరిశీలన బాధ్యతలను ఆర్‌జేడీ ఎంఈవోలకు అప్పగించారు. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఎంఈవోలకు ఆర్‌జేడీ వెబెక్స్ సమావేశం నిర్వహించి ఈ బాధ్యతలను అప్పగించారు. ఆ ప్రకారం హైస్కూల్ హెచ్‌ఎంలు తమ పాఠశాలలో బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్ఏల వివరాలను పరిశీలించి ధ్రువీకరిస్తున్నారు. ఆతర్వాత ఆ టీచర్ దరఖాస్తు ప్రింట్ తీసి, ఎస్ఆర్‌తో సహా ఎంఈవో కార్యాలయానికి వెళ్లి ఆ వివరాలన్నీ ధ్రువీకరించుకుంటున్నారు.

**డీఈవో ఆధ్వర్యంలో రెండో దశ పరిశీలన**

రెండో దశ పరిశీలన జిల్లాస్థాయిలో డీఈవో ఆధ్వర్యంలో జరుగుతోంది. అది కూడా స్థానిక డీఆర్‌ఆర్ఎం హైస్కూల్‌లో ప్రారంభమైంది. ఇందుకోసం 11 బృందాలను ఏర్పాటు చేస్తూ డీఈవో కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి దశలో ఎంఈవోల పరిశీలన పూర్తయిన తర్వాత ఆ టీచర్ ఎస్ఆర్‌లోని మొదటి పేజీ, పుట్టిన తేదీ, మొదట జాయినింగ్, ఉద్యోగోన్నతి పొందిన వివరాలన్నీ ఎస్ఆర్ పేజీలను నకళ్లు తీసి దరఖాస్తు ప్రింట్ కాపీకి జతచేసి డీఈవోకు సమర్పించాలి. స్పౌజ్ సర్టిఫికెట్, ప్రాధాన్యత కేటగిరీ పాయింట్లకు సంబంధించిన వైద్య ధ్రువీకరణ పత్రాల జెరాక్స్ కాపీలు జిల్లాస్థాయి పరిశీలనకు పంపాలి. పది టీంలు ఆ వివరాలను పరిశీలిస్తాయి. ఒక బృందం మాత్రం తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారందరూ దరఖాస్తు చేశారా? లేదా? అన్న విషయాన్ని పరిశీలిస్తుంది. జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ల బదిలీలకు 3వేలకుపైగా దరఖాస్తులు రాగా వాటిలో సగానికిపైగా మొదటి దశ పరిశీలన పూర్తయినట్లు అధికారులు చెప్తున్నారు. ఇదిలా ఉండగా బదిలీ దరఖాస్తులకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో అనేక లోపాలు ఉత్పన్నమవుతున్నాయి. ఇది ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. దీంతో ప్రక్రియలోనూ జాప్యం జరుగుతోంది

**వచ్చిన దరఖాస్తులు ఇలా..**

గ్రేడ్ టూ ప్రధానోపాధ్యాయులు 141మంది, స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్ (తెలుగు, ఇంగ్లీష్, హిందీ) సబ్జెక్టులకు 1,156మంది, స్కూల్ అసిస్టెంట్ నాన్‌లాంగ్వేజ్ (గణితం, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్)లకు 1,624 మంది, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలు 138మంది, సెకండరీ గ్రేడ్ టీచర్‌లు 1,593 మంది బదిలీలకు దరఖాస్తు చేశారు. సెకండరీ గ్రేడ్ టీచర్‌ల బదిలీలకు దరఖాస్తు గడువు ఈనెల 27 వరకూ ఉంది.



రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

## రేషన్ షాపుల్లోనే సరుకులు

- వచ్చేనెల 1 నుంచి పంపిణీ
- జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జూన్ 1వతేదీ నుంచి చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ పక్కాగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. ప్రకాశం భవన్‌లోని సమావేశపు హాలులో శనివారం రేషన్ డీలర్ల అసోసియేషన్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు రేషన్ సరుకులను ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేశామన్నారు. అయితే ఈ విధానంలో అనేక లోటుపాట్లతోపాటు, అక్రమ రవాణా జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఆవిధానాన్ని నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రస్తుతం పాతవ్యవస్థను కొత్త నిర్దేశాలతో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. వచ్చేనెల 1వతేదీ నుంచి రేషన్ షాపు వద్ద మాత్రమే సరుకులను కార్డులకు పంపిణీ చేయాలని జేసీ గోపాలకృష్ణ స్పష్టం చేశారు. పండుగ వాతావరణంలో ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించాలని ఆదేశించారు. చౌక ధరల దుకాణాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కార్డుదారులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఎండీయూ వాహన ఆపరేటర్ నుంచి ఈపోస్ మిషన్, కాటా, ఐరిస్ మిషన్లను స్వాధీనం చేసుకోవాలన్నారు. రేషన్‌షాపుల ద్వారా నిత్యావసర సరుకులను కార్డుదారులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8గంటల వరకు పంపిణీ చేయాలన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోపు 65ఏళ్లకుపైబడిన వారికి, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకు వెళ్లి ఇవ్వాలని జేసీ సూచించారు. సరుకులను పక్కదారి పట్టిస్తే సంబంధిత డీలర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



బాల వెంకటరెడ్డిని అభినందిస్తున్న డీఎస్పీ నాగరాజు

## భళా వెంకటరెడ్డి

**చిన్నారులను కాపాడిన వ్యక్తికి పోలీస్ రివార్డ్**

కొమరోలు, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటిచర్ల మోటులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులను రక్షించిన వ్యక్తికి మార్కాపురం డీఎస్పీ నాగరాజు రివార్డును అందజేశారు. ఎదురుగా వస్తున్న లారీని కారు ఢీకొనడంతో బాపట్ల జిల్లా స్టూవర్టుపురానికి చెందిన ఆరుగురు శుక్రవారం మృతి చెందారు. ఆ ప్రమాదం జరిగిన వెంటనే మండలంలోని తాటిచర్ల గ్రామానికి చెందిన పాశం బాల వెంకటరెడ్డి కారువెనుక అద్దాలను పగులగొట్టి ఇద్దరు చిన్నారులను బయటకు తీశారు. వారిని సకాలంలో గిద్దలూరు ఆసుపత్రికి తరలించేందుకు సహకరించారు. ఎస్ఐ నాగరాజు ద్వారా డీఎస్పీ నాగరాజు విషయం తెలుసుకున్నారు. పిల్లలను కాపాడిన బాలవెంకటరెడ్డికి ఆయన నగదు రివార్డును అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సీఐ బాలకోటయ్య, ఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

## 6నుంచి మెగా డీఎస్సీ పరీక్షలు : కలెక్టర్

ఒంగోలు(రూరల్), మే24(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షలు జూన్ 6నుంచి జులై6వ తేదీ వరకు జరుగుతాయని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. శనివారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ఒంగోలు నగర పరిధిలో ఈ పరీక్షల కోసం నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అందులో పేస్ ఇంజినీరింగ్ కళాశాల, రైజ్ కృష్ణసాయి, రైజ్‌కృష్ణ సాయిగాంధీ, క్విజ్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ బేస్‌డ్ విధానంలో ఈ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో డీఈవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

## మద్యం వ్యసనానికి దూరంగా ఉండాలి

● ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజామొహిద్దీన్



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ఖాజామొహిద్దీన్

సింగరాయకొండ, మే 24 (ఆంధ్రజ్యోతి) : మద్యం వ్యసనానికి దూరంగా ఉండాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఖాజామొహిద్దీన్ సూచించారు. సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని బాలయోగినగర్‌లో శనివారం ఆల్కహాల్ వినియోగం, దాని దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖాజామొహిద్దీన్ మాట్లాడుతూ మద్యపానం వలన శరీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని తెలిపారు. కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతాయన్నారు. మద్యానికి దూరంగా ఉంటూ ఆరోగ్యమైన జీవనశైలిని అలవరుచుకోవాలన్నారు. సీఐ హజరత్తయ్య మాట్లాడుతూ మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు చైతన్యకృష్ణ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎర్ర వెంకట్, సీఐ శివకుమారి, ఎస్సైలు బి.మహేంద్ర, రాజశేఖర్ పాల్గొన్నారు.

## కేసులు నమోదు చేయాలి



మాట్లాడుతున్న రఘురాం

ఒంగోలు కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బొమ్మ ఊరేగింపును అడ్డుకున్న వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు నాయకులు కోరారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి వి.మోజేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధానకార్యదర్శి బి.రఘురాం మాట్లాడుతూ ఈ ఘటన జరిగిన 40 రోజులు గడుస్తున్నా రాజకీయ వత్తిళ్ళ కారణంగానే ఇంతవరకు పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. ఉన్న సమగ్ర విచారణ చేయించి అందుకు బాధ్యులైన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నీలం నాగేంద్రరావు, కొప్పోలు ఏడుకొండలరావు, దాసరి సుందరం, కంకణాల ఆంజనేయులు, డీవీఆర్.కోటి, మేడిది రవి, బంటుపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## మూగజీవాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



సదస్సులో మాట్లాడుతున్న మురళీకృష్ణ

ఒంగోలు కల్చరల్, మే 24(ఆంధ్రజ్యోతి): సమాజంలో మూగజీవాలను సంరక్షించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ కోరారు. శనివారం సాయంత్రం స్థానిక రంగారాయుడు చెరువు వాకింగ్ ట్రాక్‌పై సేవ్ ది యానిమల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు టి.దివ్య అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మూగజీవాల ఆలనాపాలనా చూసుకోవటం, వాటికి ఏదైనా కష్టం కలిగినప్పుడు మానవతా దృక్పథంతో స్పందించడం అందరి బాధ్యతన్నారు. డాక్టర్ శాంతి మాట్లాడుతూ మూగజీవాలకు ఆహారం, నీరు అందించాలని కోరారు. కార్పొరేటర్ మలగా రమేష్ మాట్లాడుతూ జంతు సంరక్షణకు సేవ్ ది యానిమల్ ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు టి.దివ్య మాట్లాడుతూ ఏదైనా రోడ్డు ప్రమాదంలో కానీ ఇతరత్రా మూగజీవాలు గాయపడినప్పుడు తమకు తెలియజేస్తే వాటికి వైద్యం అందించటం, సంరక్షణ వంటి చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సేవా కార్యక్రమాల నిర్వహణకు దాతలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మారెళ్ల సుబ్బారావు, కోసూరి శ్రీదేవి, డాక్టర్ సీహెచ్.సుధాకర్‌బాబు, సుధీర్‌బాబు, శ్యామలరావు, జాలాది మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## లారీ బోల్తా.. డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు

పెద్దారవీడు, మే 24 (ఆంధ్రజ్యోతి) : కూరగాయల లారీ బోల్తా పడి ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని దేవరాజుగట్టు సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగింది. పలమనేరు మున్సిపల్ చైర్మన్ షేక్ జాఫర్‌కు చెందిన లారీ చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి ఒడిశాలోని బిలాస్‌పూర్‌కు కూరగాయాల లోడ్‌తో వెళ్తోంది. దేవరాజుగట్టు సమీపంలో లారీ బోల్తా పడి డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. ఎస్సై అనిల్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కిశోరివికాసం.. బాలిక భద్రం..!

వచ్చే నెల 10వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు

అవగాహన కల్పిస్తున్న కమిటీ సభ్యులు




| నియోజకవర్గంలోని కిశోరిబాలికల వివరాలు | |
|---|---|
| మద్దిపాడు మండలం | -791 |
| నాగులుప్పలపాడు మండలం | -732 |
| చీమకుర్తి మండలం | -970 |
| సంతనూతలపాడు మండలం | - 594 |

సంతనూతలపాడు, మే 24(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో బాలికల సంరక్షణ కోసం కిశోరి వికాసం పేరుతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని రూపకల్పన చేసింది. బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలపై వారిలో అవగాహన కల్పించనుంది. అందులో భాగంగా కిశోరి బాలికలకు ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలు, కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో జరిగే బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు తదితర విషయాలపై వారికి అవగాహన కల్పిస్తున్నారు. చదువుతున్న, బడిమానేసిన 11-18 సంవత్సరాల మధ్యలోని బాలికలను గుర్తించి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని ఈనెల 2 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో మొత్తం 286 అంగనవాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**గ్రామ కమిటీల ఆధ్వర్యంలో..**

కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహణకు గ్రామ, వార్డు మహిళ సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా ఏఎన్ఎం, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వీవోఏలు ఐదుగురు సభ్యులుగా కమిటీ ఏర్పాటుచేశారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు ఇందులో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు.

**ఇవీ కార్యక్రమాలు..**

బాలికలు ఒకరిని ఒకరు పరిచయం చేసుకోవడం లైంగిక విద్య, రుతుక్రమం, పరిశుభ్రత, బాల్యవివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, బాలికల సంరక్షణకోసం ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించడం, కౌమారదశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లింగవివక్ష, అసమానతలు, ఉన్నత విద్య, నైపుణ్యాలు, సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ భద్రత, వివిధ సమస్యలను ఎదుర్కోవడం, ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు, నాయకత్వం, సాధికారత, శారీరకవ్యాయామం, ఆటల ప్రాముఖ్యత వంటి 12 కార్యక్రమాలను రూపకల్పన చేసి అమలు చేస్తున్నారు. వీటితో పాటు జూన్ 4న రాష్ట్రవ్యాప్తంగా కిశోరిబాలికల తల్లిదండ్రులతో అన్ని గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించనున్నట్లు అధికారులు చెబుతు న్నారు.

**అవగాహన కల్పిస్తున్నాం..**

ప్రభుత్వం సూచించిన షెడ్యూల్ ప్రకారం అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో కిశోరి బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా పర్యవేక్షిస్తున్నాం. సమాజంలో ఎదురయ్యే సవాళ్లతో పాటు వారి ఆరోగ్యం భద్రత కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలు విషయాలపై అవగా హన కల్పిస్తున్నాం.

-ఇవాంజిలిన్, సీడీపీవో,
మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు

# బాలనాగేంద్రా.. నోరు అదుపులో పెట్టుకో..!

● తెలుగు తమ్ముళ్ల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఒంగోలు కార్పొరేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి): వారానికో పార్టీలో ఉంటూ ఆ పార్టీల పేరుతో వసూళ్ళకు పాల్పడే జడా బాలనాగేంద్ర యాదవ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, లేదంటే తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందని తెలుగుదేశం పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌పై జనసేన పార్టీకి చెందిన జడా బాలనాగేంద్రయాదవ్ చేసిన వ్యాఖ్యలపై వారు మండిపడ్డారు. శనివారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాచగర్ల వెంకట్రావు, బండారు మదన్, ఎద్దు శశికాంత్‌భూషణ్, ఆర్ల వెంకటరత్నం మాట్లాడారు. ఎమ్మెల్యే దామచర్లను విమర్శించే స్థాయి, అర్హత బాలనాగేంద్రకు లేదన్నారు. పిచ్చి పట్టి నోటికొచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని వారు హెచ్చరించారు. మహానాడులో తమ నాయకుడు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వాస్తవాలు మాట్లాడారన్నారు. అంత పౌరుషం ఉంటే మీ నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డి ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఛీదరించి ఓడించినా ఇంకా మార్పు రాకపోవడం సిగ్గు చేటన్నారు. డొక్కా సీతమ్మ క్యాంటీన్ పేరుతో రూ.లక్షలు వసూలు చేసిన బాలనాగేంద్రయాదవ్ అవినీతి గురించి మాట్లాడటం సిగ్గు చేటు అన్నారు. బాలినేని మెప్పుకోసం నోటికొచ్చినట్లు మాట్లాడితే తగిన గుణపాఠం చెబుతామని, నోరు అదుపులో ఉంచుకోవాలని వారు హెచ్చరించారు.

# నేడు నగరంలో హనుమాన్ శోభాయాత్ర

హిందువులు భారీగా పాల్గొనాలని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ పిలుపు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘాల నాయకులు

ఒంగోలు కల్చరల్, మే 24(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఒంగోలులో ఆదివారం సాయంత్రం హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయా సంస్థల నాయకులు తెలిపారు. శనివారం నగరంలోని స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తూనుగుంట మల్లిఖార్జునరావు, భజరంగ్ దళ్ కార్యదర్శి మఠంపల్లి దుర్గేష్ మాట్లాడుతూ సంతపేట శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం దగ్గర నుంచి బైక్ ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. డీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్ నెల్లూరు బస్టాండ్, ట్రంక్‌రోడ్, బాపూజీ కాంప్లెక్, అద్దంకి బస్టాండ్, కర్నూల్ రోడ్ ఫ్లై ఓవర్, మంగమూరురోడ్డు జంక్షన్, చిట్టి ఆంజనేయ స్వామి దేవస్థానం, రాజాపానగల్ రోడ్ మీదుగా కేశవస్వామిపేట శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం వరకు ర్యాలీ కొనసాగుతుందని చెప్పారు. కనుక ఈ హనుమాన్ శోభాయాత్రలో హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. సమావేశంలో వీహెచ్‌పీ ప్రాంతీయ సత్సంగ్ సోమా సుబ్బారావు, జిల్లా కార్యదర్శి ఈమని బలరాం, పెరుమాళ్లు, పసుమర్తి వెంకటేశ్వర్లు, ప్రచార ప్రముఖ్ రాధారమణ గుప్తా జంధ్యం, త్రిపుర భైరవేశ్వరనందస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి గొట్టిపాటి



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం 51 మందికి రూ.51 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ పేద కుటుంబాలకు చెందినవారు అనారోగ్యం పాలైన సమయంలో సీఎం సహాయనిధి ఓ ఉపశమనం అని అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ, మరోపక్క అనారోగ్యలతో వైద్యం చేయించుకోలేక పేద కుటుంబాలు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వం వారికి సీఎం సహాయనిధి ద్వారా వైద్య ఖర్చులను భరించి భరోసాగా నిలుస్తుందన్నారు. ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యం అంటే పేద కుటుంబాలు భయపడే పరిస్థితి ఉన్న సమయంలో ఎమ్మెల్యే ఉగ్ర వారికి అండగా నిలబడి సీఎం సహాయనిధి ద్వారా వారికి వైద్య ఖర్చులు వచ్చేలా చేస్తుండటం అభినందనీయమన్నారు. దరఖాస్తు చేసే ప్రక్రియ నుంచి సీఎం సహాయనిధి వచ్చే వరకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపటం హర్షించదగిన విషయమన్నారు. కనిగిరి అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తూనే ప్రజాసంక్షేమాన్ని కాంక్షిస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను కనిగిరి ప్రాంత ప్రజలు విస్మరించరాదన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నవారు పూర్తివివరాలతో కార్యాలయంలో దరఖాస్తు అందజేస్తే అర్హులైన వారికి సీఎం సహాయ నిధి ద్వారా నగదు అందించి తోడ్పాటునందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కడపలో జరిగే మహానాడుకు తరలిరావాలి

● డాక్టర్ లలిత్‌సాగర్

దర్శి, మే 24 (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే మహానాడుకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ కోరారు. దర్శి టీడీపీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దిండి రాజేష్‌ను డాక్టర్ లలితసాగర్, మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు సన్మానించారు. ఈసందర్భంగా లలిత్‌సాగర్ మాట్లాడుతూ ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో నిర్వహిస్తున్న మహానాడును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, టీడీపీ పట్టణాధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, దర్శి, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల టీడీపీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, మోడి ఆంజనేయులు, పిడతల నెమలయ్య పాల్గొన్నారు.

## విద్యాశాఖలో ఉద్యోగుల బదిలీలు షురూ

ఒంగోలు విద్య, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు (నాన్‌టీచింగ్ స్టాఫ్) బదిలీలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఒకే కార్యాలయంలో ఐదు సంవత్సరాలు పనిచేసిన వారు బదిలీ కావాల్సిందే. ఈనేపథ్యంలో డీఈవో కార్యాలయం, ఇతర విద్యాశాఖ కార్యాలయాల్లో పనిచేస్తున్న నాల్గో తరగతి ఉద్యోగులు, రికార్డు అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, సూపరిటెండెంట్‌ల సీనియారిటీ జాబితాలను డీఈవో వెబ్‌సైట్‌లో, కార్యాలయ నోటీసు బోర్డులో ఉంచారు. ఈ జాబితాలపై శనివారం ఉద్యోగుల నుంచి అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అభ్యర్థన మేరకు బదిలీ కోసం ఈనెల 25 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. ఇతర వివరాలకు తన కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## మద్యం ఎమ్మార్పీని ఉల్లంఘించలేదు

● చీమకుర్తి ఎక్సైజ్ సీఐ సుకన్య

ఒంగోలు క్రైం, మే24(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్‌శాఖకు చెందిన ఎస్‌టీఎఫ్ విభాగం వారు తనిఖీలలో భాగంగా శుక్రవారం మద్దిపాడు మండలం కొష్టాలు సెంటర్‌లో ఉన్న మద్యం దుకాణంలో గుడ్‌ఫ్రెండ్స్ విస్కీ క్వార్టర్ బాటిల్ కొనుగోలు చేశారని చీమకుర్తి ఎక్సైజ్ సీఐ సుకన్య ఓ ప్రకటనలో తెలిపారు. అయితే అక్కడ బాటిల్‌పై ఎమ్మార్పీ రూ.110 ఉండగా షాప్ యజమాని రూ.120 వసూలు చేశారన్నారు. దీంతో ఎమ్మార్పీ ఉల్లంఘన జరిగిందని అధికారులు భావించారని పేర్కొన్నారు. అయితే అనంతరం ఇన్‌వాయిస్‌ను పరిశీలించారని, ఆ బాటిల్ ధర రూ.120 ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. చీమకుర్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న 18 దుకాణాలను తాను శనివారం పరిశీలిచానని ఎక్కడా ఎమ్మార్పీ ఉల్లంఘన జరగలేదని వివరణ ఇచ్చారు.

## నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు : ఎస్ఈ

ఒంగోలుక్రైం, మే24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ఆదివారం కూడా అవకాశం కల్పించినట్లు ఆ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లాలో ఉన్న అన్ని విద్యుత్ బిల్లుల చెల్లింపుల కౌంటర్లు తెరిచే ఉంటాయన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## 'కరవదిలో రీసర్వే వారంలో పూర్తి చేస్తాం'

ఒంగోలు(రూరల్), మే24(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది, దశరాజుపల్లి గ్రామాల్లో భూముల రీసర్వేను వారం రోజుల్లో పూర్తి చేస్తామని రూరల్ తహసీల్దార్ నాయబ్‌రసూల్ తెలిపారు. శనివారం ఒంగోలులోని రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరవది, దశరాజుపల్లి గ్రామాల్లో రైతుల పట్టాభూములు 4126.58 ఎకరాలు, ప్రభుత్వ భూములు, డొంకలు, రోడ్డులు మొత్తం 839.19 ఎకరాలు ఉన్నట్లు చెప్పారు. ఇనామ్, సర్వీస్‌ఇనామ్, డాటెడ్ భూములు 1564.67 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

## నేడు ఉచిత వైద్యశిబిరం

సంతనూతలపాడు, మే 24(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు జడ్పీహైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం సేవాసంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ, ఫౌండర్ పాతూరి సంపత్‌లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒంగోలు సర్వనేత్రాలయ సూపర్‌స్పెషాలిటీ రెటీనా కంటి ఆసుపత్రి పర్యవేక్షణలో ఈ వైద్యశిబిరం జరగనున్నట్లు పేర్కొన్నారు. రోగులు తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని కోరారు.

## చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

మద్దిపాడు, మే 24(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు సరోజనమ్మ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ముండ్లమూరు మండలం బొప్పూడివారిపాలెంకు చెందిన ఇజం సరోజనమ్మ మరో ఇరువురు మహిళలతో కలిసి మేదరమెట్ల నుంచి వెల్లంపల్లిలో బస్సు దిగారు. వెల్లంపల్లిలోకి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా ఓ వాహనం ఢీకొన్న సంగతి తెలిసిందే. ఆమె శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు మద్దిపాడు పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## బాధితురాలికి ఆర్థికసాయం అందజేత

మద్దిపాడు, మే 24(ఆంధ్రజ్యోతి): కొలచనకోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళకు జనసేన పార్టీ నాయకులు శనివారం ఆర్థికసాయాన్ని అందజేశారు. కొటచనకోట గ్రామానికి చెందిన యాకసిరి వెంకటేశ్వర్లు భార్య శారద ఈ నెల 14వ తేదీన కూలి పని నిమిత్తం బాపట్ల జిల్లాకు వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. దీంతో చికిత్స పొందుతున్న ఆమెను శనివారం గ్రామానికి వచ్చిన జనసేన పార్టీ నాయకులు పరామర్శించి రూ.10వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నున్న బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు ఆరం వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శులు తిరుమలశెట్టి చిరంజీవి, ఘడియపూడి సత్యం, నరసింహారావు, కావూరి శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు వైసీపీ ఒంగోలు నియోజకవర్గ స్థాయి సమావేశం

ఒంగోలు కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఒంగోలు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం సాయంత్రం స్థానిక సాయిఐటీ కళ్యాణ మండపంలో జరుగుతుందని ఆ పార్టీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్ తెలిపారు. శనివారం ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు అధ్యక్షత వహిస్తారన్నారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## పాత పెన్షన్‌ను పురుద్ధరించాలి

ఒంగోలు విద్య, మే 24 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2003 టీచర్లుగా ఎంపికైన వారందరికీ పాతపెన్షన్‌ను పునరుద్ధరించాలని డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం డిమాండ్ చేసింది. శనివారం ఒంగోలులో జరిగిన సమావేశంలో ఫోరం నాయకులు మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం(సీపీఎస్) ప్రవేశపెట్టక ముందే తమ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైనందున తమకు పాతపెన్షన్ వర్తిస్తుందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కన్వీనర్‌గా కె.సుధాకర్, వి.అనురాధలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తిరుపాల్‌రెడ్డి, నాయుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సీహెచ్‌వోల దీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు శనివారానికి 26వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. గత 26 రోజుల నుంచి దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పటికైనా జోక్యంచేసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గంటా ప్రసన్న, జీవనజ్యోతి, శైలజ, దీప్తి, కామేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్‌కాలనీలో పట్టపగలే చోరీ

● 100 గ్రాముల బంగారం అపహరణ



ఇంట్లోని వస్తువులను చిందరవందరగా పడేసిన దొంగలు

ఒంగోలు క్రైం, మే24(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం మంగమూరు రోడ్డులోని జర్నలిస్ట్ కాలనీలో పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగింది. దుండగులు 100 గ్రాములు బంగారపు ఆభరణాలు అపహరించుకెళ్లారు. వివరాలలోకి వెళితే.. స్థానిక జర్నలిస్ట్ కాలనీలో రెండో లైన్‌లో శ్రీమంతుల శివకృష్ణ నివసిస్తుంటారు. శనివారం మధ్యాహ్నం ఆయన భార్య రాధిక ఒక్కరే ఉన్నారు. ఆమె ఇంటి ఆవరణలో ఉన్న బాత్‌రూమ్‌లో స్నానం చేసేందుకు వెళుతూ తన బంగారపు ఆభరణాలు ఇంట్లో పెట్టారు. ఆమె తిరిగి వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు ఆభరణాలను చోరీ చేశారని వెంటనే భర్తకు సమాచారం చేరవేశారు. ఈ మేరకు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో శివకృష్ణ ఫిర్యాదు చేశారు. సీఐ విజయకృష్ణ పరిశీలించి విచారణ చేపట్టారు.

## పండ్లతోటలు, పూల మొక్కలు సాగుకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరంలో నూరుశాతం రాయితీతో పండ్లతోటలు, పూల మొక్కలు సాగు చేసుకునేందుకు దరఖాస్తులు చేసుకోవాలని డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. మామిడి, జామ, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, నేరేడు, సపోట, కొబ్బరి, చింత, ఆపిల్‌బేర్, డ్రాగన్ ఫ్రూట్, అంజుర, మునగ, మల్లె, రోజ్ తదితర పండ్లు, పూలమొక్కల సాగుకు అవకాశం ఉందన్నారు. జాబ్‌కార్డు ఉండి 0.25 నుంచి 5 ఎకరాల లోపు కలిగిన సన్న చిన్నకారు రైతులు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు భూసార పరీక్షల కార్డు, 1బిఅండల్ సర్టిఫికేట్, సన్న/చిన్న కారురైతు సర్టిఫికెట్ (తహసీల్దార్ అనుమతి) ఉండాలన్నారు. జిల్లాలో 6500 ఎకరాలు లక్ష్యంగా నిర్ధేశించగా ఇప్పటివరకు 915 మంది రైతులకు చెందిన 2,670 ఎకరాలను గుర్తించినట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం ఉపాధి పథకం ఏపీవో, ఎంపీడీవో, ప్రోగ్రామ్ అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

# వ్యాపారులకు టార్గెట్

# రంగంలోకి మార్క్‌ఫెడ్

- బర్లీ పొగాకు సమస్యపై స్పష్టమైన విధానాన్ని వెల్లడించిన మంత్రులు
- వ్యాపార సంస్థల ప్రతినిధులకు హెచ్చరికలు
- రూ.12వేలు మద్దతు ధర నిర్ణయం
- ప్రభుత్వ సంస్థను రంగంలోకి దించేందుకు ఆదేశాలు

*నల్లబర్లీ రైతులకు ప్రభుత్వం ఊరట కల్పించింది. ఇటు వ్యాపార సంస్థలకు నిర్దిష్ట లక్ష్యాన్ని విధించటంతో పాటు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించబోతోంది. ఈ మేరకు వ్యాపార సంస్థలకు మంత్రులు హెచ్చరికలు జారీ చేశారు. అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మార్టూరు సమీపంలోని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయం ఆవరణలో ఆయన అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయాలు జరిగాయి.*



నల్లబర్లీ రైతులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

బర్లీ పంటను సాగు చేయమని ప్రోత్సహించిన వ్యాపార సంస్థలే తగ్గిన ఎగుమతి ఆర్డర్లు సాకుగా చూపి ఈ ఏడాది కొనుగోళ్లు తగ్గించాయి. రైతు అవసరాన్ని బలహీనతగా చేసుకొని ధరలో భారీగా కోత వేశాయి. గత ఏడాది క్వింటాల్‌కు రూ.14వేలు ధర ఇచ్చిన ఆ సంస్థలు ఈ ఏడాది సరాసరిన రూ.7వేలు ధరను కూడా ఇవ్వలేదు. కొనుగోళ్లు పూర్తిగా తగ్గించాయి. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫార్సుతో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. తదనుగుణంగా శనివారం మార్టూరు వచ్చిన మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇటు రైతులతోనూ, అటు పొగాకు వ్యాపార సంస్థల ప్రతినిధులతోనూ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారుల సమక్షంలో ముఖాముఖి నిర్వహించారు. సమీప గ్రామాలకు చెందిన పది మంది రైతులు పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు.

**చెప్పిన ప్రకారం కొనుగోళ్లు చేయాల్సిందే!**

వ్యాపార సంస్థల ప్రతినిధుల అభిప్రాయాలను మంత్రులు తెలుసు కున్నారు. తొలుత ఇండియన్ టుబాకో అసోసియేషన్ ప్రతినిధిగా వచ్చిన కార్యదర్శి చౌదరి మాట్లాడుతూ వ్యాపార సంస్థలు తప్పనిసరి పరిస్థితుల్లో పొగాకుకు అనుకున్న ధరను ఇవ్వలేకపోతున్నారని వివరించే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే ఏలూరి జోక్యం చేసుకొని రైతులకు హామీలు ఇచ్చి ఇప్పుడు మాట మారుస్తారా అంటూ ప్రశ్నించారు. మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి జోక్యం చేసుకున్నారు. 'మీరు రైతులకు అండగా ఉండాలి తప్పా వ్యాపార సంస్థలను వెనకేసుకు రావద్దు' అని మందలించారు. ఆ తర్వాత ఐటీసీ ప్రతినిధి రవిశంకర్ మాట్లాడుతూ తాము గతేడాది 4 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేశామని, ఈ ఏడాది ఆ మేరకే కొనుగోలు చేస్తామని చెప్పారు. వెంటనే మంత్రులు, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని అలా అయితే కుదరదని కరాఖండీగా చెప్పారు. కనీసం 10 మిలియన్ కిలోల పొగాకు కొనాలని లేకపోతే సీఎం చంద్రబాబు తగు నిర్ణయం తీసుకుంటారని హెచ్చరించారు. దీంతో దిగివచ్చిన రవిశంకర్ 7 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు చేసేందుకు తాము సిద్ధమని, మీరు కోరినట్లు 10 మిలియన్ కిలోల కొనుగోలు విషయం తమ సంస్థ ఉన్నతాధికారులతో సంప్రదిస్తానని హామీ ఇచ్చారు. జీపీఐ సంస్థ ప్రతినిధి ప్రభాకర్ మాట్లాడుతూ రైతులు తమపై చేసిన ఆరోపణలపై వివరణ ఇవ్వగా ఆ విషయాన్ని పక్కన పెట్టి కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వాలని మంత్రులు కోరారు. మంత్రి రవికుమార్ జీపీఐపై ప్రత్యేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రభాకర్ తమకు ఒక కంపెనీ ఎగుమతి ఆర్డరు రద్దు అయిందని అందువల్ల కొనుగోలు మందగించిందని, కొత్త కంపెనీ నుంచి ఎగుమతి ఆర్డర్ పొందే ప్రయత్నంలో ఉన్నామని, ఆ తదుపరి కొనుగోలు వేగం పెంచుతామని చెప్పారు. అయితే మంత్రులు అంగీకరించకపోగా ఆది, సోమవారాల్లోనే కొనుగోళ్లు పెంచాలని, కనీసం 20 మిలియన్ కిలోల పొగాకు మీరే కొనాలని జీపీఐకి గట్టిగా సూచించారు. అయితే 10 మిలియన్ కిలోల కొనుగోలుకు ఇబ్బంది లేదని ఆపై కొనుగోలు విషయంపై యాజమాన్యంతో మట్లాడి చెబుతానని ప్రభాకర్ తెలిపారు. అయితే మంత్రులు అందుకు అంగీకరించకుండా 20 మిలియన్ కిలోలు కొనుగోలు చేయాల్సిందేనని లేదంటే సీఎం చంద్రబాబు తీసుకునే నిర్ణయాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

**లోగ్రేడ్ రూ.5వేలు.. హైగ్రేడ్ రూ.12వేలు**

తర్జనభర్జనల అనంతరం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నాలుగు రకాల గ్రేడ్లు తగ్గించి లోగ్రేడ్, హైగ్రేడ్‌గా పరిగణించాలని సూచించారు. లోగ్రేడ్ క్వింటాల్‌కు రూ.4 వేలు నుంచి రూ.7 వేలు, హైగ్రేడ్ రూ.12వేలు ధరను ఇచ్చి సంస్థలు కొనుగోలు చేయాలని, అందుకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపాలని వ్యాపార సంస్థలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని ప్రతిపాదించారు. దీంతో మంత్రి అచ్చెన్నాయుడు ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రకటిస్తూ ఐటీసీ కంపెనీ 10 మిలియన్ కిలోలు, జీపీఐ 20 మిలియన్ కిలోలు కొనుగోలు చేయాలని, మిగిలిన వ్యాపార సంస్థలకు కొనుగోళ్లు చేసిన టార్గెట్‌లను నెలరోజుల్లో అధికారుల నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి బర్లీ పొగాకును కొనుగోలు చేస్తుందని స్పష్టంగా ప్రకటించారు. అటు వ్యాపారులైనా, ఇటు ప్రభుత్వ రంగ సంస్థలైనా లోగ్రేడ్‌కు రూ.5 వేలు పైబడిన ధరను, హైగ్రేడ్‌కు క్వింటాకు రూ.12వేలు ధరను ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ నిర్ణయాలపై అనునిత్యం పర్యవేక్షణ ఉంటుందని, మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి ప్రకటించారు.

అందిన సమాచారం మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపేందుకు సీఎం చంద్రబాబు సూచనల మేరకు ఉన్నతాధికారులు ఒక ప్రణాళిక రూపొందించినట్లు కూడా తెలిసింది. ఈ విషయంపై మహానాడు అనంతరం ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించే అవకాశం ఉంది. ఈ సమావేశంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ ఢిల్లీరావు ప్రిన్సిపల్ కార్యదర్శి రాజశేఖర్, పొగాకు బోర్డు ఛైర్మెన్, ఈడీ, దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ లక్ష్మీ, జిల్లా కలెక్టర్ వెంకటమురళీ, వ్యవసాయ, మార్కెట్ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

# మెప్మా జాబ్‌మేళాతో ఉజ్వల భవిష్యత్ సాధించాలి

- ఉద్యోగాలు తీసుకునే స్థాయి నుంచి ఇచ్చే స్థాయికి ఎదగాలి
- కలెక్టర్ అన్సారియా వెల్లడి
- రాష్ట్రంలోనే తొలిసారిగా ఒంగోలులో పొదుపు సభ్యుల పిల్లలకు జాబ్‌మేళా

ఒంగోలు, కార్పొరేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : యువత ఉద్యోగం అందుకునే స్థాయి నుంచి మరొకరికి ఉద్యోగాలు అందించేస్థాయికి ఎదగాలని, రాష్ట్రంలోనే తొలిసారిగా మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాతో మరింతగా ఉజ్వల భవిష్యత్ సాధించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పొదుపు సంఘాల సభ్యుల పిల్లల కోసం రాష్ట్రంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను కలెక్టర్ ప్రారంభించారు. శనివారం స్థానిక మంగమూరు రోడ్డు బైపాస్‌లోని నాగార్జున డిగ్రీ కాలేజీ ఆవరణలో నిర్వహించిన జాబ్‌మేళాకు ఐటీ స్పెషలిస్ట్ ఫణికుమారి అధ్యక్షత వహించగా, కలెక్టర్ తమీమ్ అన్సారీయా, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, పీడీ పోట్లూరి శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత లక్ష్యసాధన దిశగా చిత్తశుద్ధితో కష్టపడి పనిచేస్తే ఎంతటి కష్టమైనా పని కూడా విజయవంతం అవుతుందని అన్నారు. ఆ దిశగా యువత లక్ష్య సాధన కోసం సంకల్పంతో ముందుకెళ్లాలని అన్నారు. మేయర్ గంగాడ సుజాత, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, మెప్మా పీడీ శ్రీహరి మాట్లాడారు. కార్యక్రమంలో నాగార్జున డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రామ్‌ప్రసాద్, స్టెప్ సీఈఓ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పది లక్షల మందికి యోగాపై అవగాహన

ఒంగోలు కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురష్కరించుకొని యోగాంధ్ర-25 మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలో పది లక్షల మందికి యోగా సాధనపై అవగాహన కల్పించేలా జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఏర్పాటు చేసిన యోగా రోడ్డులో కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి పలువురు అధికారులు యోగాసనాలు చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖపట్నంలో జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రధాన మునిసిపాలిటీలు, మండల కేంద్రాల్లో ఒక రోడ్డును యోగ రోడ్డుగా ప్రకటించి ఆ రోడ్డులో ప్రతిరోజూ ఉదయం యోగాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఒంగోలు టూ బెంగళూరు ఆర్టీసీ బస్సు

ఒంగోలు, కార్పొరేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా ఒంగోలు నుంచి బెంగళూరుకు ఈనెల 25 ఒంగోలు డిపో నుంచి బెంగళూరుకు సూపర్ లగ్జరీ బస్సును ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీసు కందుకూరు, పామూరు, ఉదయగిరి, బద్వేలు, కడప మీదుగా బెంగుళూరు చేరుతుందని తెలిపారు. ప్రతిరోజూ రాత్రి 7-30 గంటలుక బయలుదేరి, ఉదయం 6-15 నిమిషాలకు బెంగళూరు చేరుతుందని తెలిపారు. బెంగళూరులో రాత్రి 9-30 గంటలకు బయలుదేరి ఉదయం 5-45 నిమిషాలకు ఒంగోలు చేరుతుందని, జిల్లా ప్రజలకు, ఆర్టీసీ అందిస్తున్న బెంగళూరు సర్వీసు సేవలను వినియోగించుకోవాలని డీఎం తెలిపారు.

## టీచర్ల బదిలీలకు యూటీఎఫ్ హెల్ప్‌డెస్క్

ఒంగోలు విద్య, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీల్లో టీచర్లకు సహాయ సహకారాలను అందించేందుకు స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ప్రత్యేకంగా హెల్ప్ డెస్కును ప్రారంభించినట్లు యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, వీరాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి, ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణ, వెబ్ ఆప్షన్లు, నమోదుకు ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కను టీచర్లు వినియోగించుకోవాలన్నారు. బదిలీల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఈ హెల్ప్‌డెస్క్ పనిచేస్తుందన్నారు. అందుకోసం యూటీఎఫ్ ఐటీ సెల్ విభాగంలో పది మంది టీమ్ సభ్యులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## 31లోపు జూనియర్ లెక్చరర్ల బదిలీలు పూర్తి

ఒంగోలు విద్య, మే 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్లు, ప్రిన్సిపాళ్ల బదిలీలను ఈనెల 31లోపు పూర్తి చేయనున్నట్లు ఇంటర్మీడియేట్ విద్యా డైరెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఈ మేరకు బదిలీలకు సంబంధించి తాజా షెడ్యూల్‌ను ప్రకటించారు. 27 నుంచి 29 వరకు జూనియర్ లెక్చరర్లు, కళాశాలల ప్రిన్సిపాల్స్ ఖాళీల వివరాలను ప్రకటిస్తారు. 27 నుంచి 29 వరకు వెబ్‌ఆప్షన్లు పెట్టుకొనేందుకు అవకాశం ఇచ్చారు. దరఖాస్తులో తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలితే సంబంధిత జూనియర్ లెక్చరర్లపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించారు. ఖాళీల వివరాలు, దరఖాస్తుల్లో ఏమైనా వివాదాలు వచ్చినా, సవరణలు అవసరమైనా సంబంధిత ఆర్జేడీలు బాధ్యత వహించాల్సి వస్తోందని ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించారు.



# సత్తాచాటిన ఆకవీడు ఎడ్లు

- ప్రథమ బహుమతిగా రూ.40వేలు
- ద్వితీయ స్థానంలో నిలిచిన కృష్ణా జిల్లా జత



ప్రథమ బహుమతిని గెలుచుకున్న ఎడ్లు

తర్లుపాడు, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సీతానాగులవరంలో వీరాంజనేయ స్వామి జయంతి మహోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పాలపళ్ల విభాగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆకవీడు గిత్తలు సత్తా చాటాయి. పోటీలకు మొత్తం 8 జతల గిత్తలు పాల్గొన్నాయి. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకవీడు గ్రామానికి చెందిన సూరా చైత్రారెడ్డి ఎడ్లు 4250 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ బహుమతి రూ.40వేలు గెలుచుకున్నాయి. కృష్ణ జిల్లా పెనమలూరు మండలం ఎనుములకుదురు గ్రామానికి చెందిన అనంతనేని శ్రీకావ్య, శ్రీమధు ఎడ్లు 4200 అడుగుల దూరాన్ని లాగి ద్వితీయ బహుమతిగా రూ.30వేలు గెలుచుకున్నాయి. నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామానికి చెందిన బీఎస్ఎస్ రెడ్డి ఎడ్లు 3960 అడుగుల దూరాన్ని లాగి తృతీయ బహుమతి రూ.20వేలు, ప్రకాశం జిల్లా బేస్తవారపేట మండలం కాజీపురం గ్రామానికి చెందిన వేగనాటి ఓసూరారెడ్డి ఎంపీపీ ఎడ్లు 3750 అడుగుల దూరాన్ని లాగి నాలుగో బహుమతిగా రూ.10వేలు, కృష్ణాజిల్లా పెనమలూరు మండలం ఎనమలకుదురు గ్రామానికి చెందిన అనంతనేని శ్రీకావ్య, శ్రీమధు రెండో జత ఎడ్లు 3116 అడుగుల దూరాన్ని లాగి ఐదో బహుమతిగా రూ.8వేలు, ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం గన్నెపల్లె గ్రామానికి చెందిన డి.కాశీంవలి ఎడ్లు 3012 అడుగుల దూరాన్ని లాగి ఆరో బహుమతిగా రూ.6వేలను గెలుచుకున్నాయి. సత్తా చాటిన ఎడ్ల యజమానులకు కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పాల్గొన్నారు.


# అప్పుల బాధతో పొగాకు రైతు ఆత్మహత్య

పంగులూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో పొగాకు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన బాపట్ల జిల్లా పంగులూరు మండలంలోని జనకవరం గ్రామంలో ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామానికి చెందిన యువరైతు తలపనేని శ్రీనాథ్ (34) శుక్రవారం రాత్రి పురుగుమందు తాగి పంట పొలంలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. శ్రీనాథ్‌కు గ్రామంలో రెండున్నర ఎకరాల పొలం ఉంది. కరోనాకు ముందు బళ్లారి వలస వెళ్లి వ్యవసాయం చేశాడు. అక్కడ నష్టాలు వచ్చాయి. దీంతో సొంతూరికి వచ్చి సొంతభూమితో పాటు ఏడు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఇక్కడా కలిసి రాక ఏటా నష్టాలు వచ్చాయి. అప్పుల భారం పెరిగిపోయింది. దీంతో కొంత పొలం అమ్మి అప్పులు తీర్చాలని ప్రయత్నం చేశాడు. అయితే బ్యాంకు తాకట్టులో ఉండటంతో లాభం లేకుండా పోయింది. ఈ ఏడాది ఏడెకరాల విస్తీర్ణంలో సాగు చేసిన శనగ, మొక్కజొన్న, నల్లబర్లీ పొగాకుకు ధర లేదు. దీంతో అప్పుల భారం మరింత పెరిగింది. పంగులూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, సొసైటీలలో రూ.15లక్షలు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ.15 లక్షల వరకు రుణం ఉంది. అప్పు తీర్చే దారి కన్పించక శుక్రవారం రాత్రి పొలం వద్దకు వెళ్లి పురుగుమందు తాగాడు. శనివారం ఉదయం శ్రీనాథ్ తండ్రి హరిబాబు పొలం వద్దకు వెళ్లగా కుమారుడు విగతజీవుడై కనిపించాడు.

గ్రామంలో సొంతిల్లు కూడా లేని శ్రీనాథ్ గేదెలు కాస్తూ పాలమ్ముకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అప్పుల వేదనతో ఆత్మహత్యకు పాల్పడిన తీరును కుటుంబసభ్యులు, బంధువులు జీర్ణించుకోలేక పోతున్నారు. శ్రీనాథ్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనతో జనకవరంలో విషాదం అలముకుంది. పొగాకులో వచ్చిన నష్టాలే అతనిని బలి తీసుకున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నేత గుర్రం ఆదిశేఖర్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, సీనియర్ నాయకులు కందిమళ్ల కోటేశ్వరరావులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. జె.పంగులూరు ఎస్ఐ వినోద్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రేషనలైజేషన్‌లో మిగిలిపోతున్న వీఆర్వోలకు న్యాయం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయాలను రేషనలైజేషన్ కారణంగా 354 మంది వీఆర్వోలు మిగులుగా చూపిస్తున్నారని, వారందరికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శనివారం గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య ఆధ్వర్యంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి సమస్యను విన్నవించారు. జిల్లాలో 1055 మంది వీఆర్వోలు ఉండగా వారిలో 354 మందిని మిగులుగా చూపిస్తున్నారని, వారందరినీ ఏ విధంగా సర్దుబాటు చేస్తారో ఇంత వరకు విధి విధానాలు లేవన్నారు. ప్రస్తుతం ఉన్న వీఆర్వోలను తగ్గించడం వల్ల పనిభారం కూడా అధికమై ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అందువల్ల పాత వీఆర్వో క్యాడర్ స్ట్రెంత్ ప్రకారం వీఆర్వోలను సచివాలయాల్లో నియమించాలని కోరారు. అదే విధంగా గ్రేడ్-1,2 వీఆర్వోల పదోన్నతుల్లో కూడా జాప్యం జరుగుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఆయా అంశాలపై స్పందించిన కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. వీఆర్వోల పదోన్నతులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీఆర్వోను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, అమరావతి జేఏసీ జిల్లా ఛైర్మన్ పిన్నిక మధుసూదన్‌లను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.



కలెక్టర్ అన్సారియాకు వినతిపత్రం అందిస్తున్న వీఆర్వోల సంఘం నాయకులు

## సర్వేయర్లను అదనంగా చూపించడం తగదు

- సచివాలయాల హేతుబద్ధీకరణపై ఉద్యోగుల సంఘం

ఒంగోలు కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయాల హేతుబద్ధీకరణలో సర్వేయర్లను సర్‌ప్లస్‌గా చూపించడాన్ని పరిశీలించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జేసీకి సమస్యలు వివరించారు.

# స్టువర్టుపురానికి ఆరు మృతదేహాలు

» పోస్టుమార్టం పూర్తి

» బంధువులకు అప్పగించిన అధికారులు



పోస్టుమార్టం పూర్తయిన మృతదేహాలను తీసుకెళ్తున్న బంధువులు

గిద్దలూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : కొమరోలు మండలం తాటిచెర్లమోటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆరుగురి మృతదేహాలకు శనివారం పోస్టుమార్టం పూర్తి చేశారు. శుక్రవారం మధ్యాహ్నం స్టువర్టుపురం గ్రామానికి చెందిన వ్యక్తులు కారులో వెళ్తూ తాటిచెర్లమోటు వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో ఆరుగురు దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మృతిచెందిన తల్లి గజ్జల అంకాలు, కుమారుడు గజ్జల నరసింహ, కుమార్తె గజ్జల భవాని, వీరి బంధువులైన బచ్చు సందీప్ అలియాస్ సన్ని, గజ్జల జోసఫ్‌రాజు అలియాస్ బబ్లు డ్రైవర్ కర్రెద్దుల దివాకర్ అలియాస్ చిన్ని మృతదేహాలకు శనివారం పోలీసులు శవపంచనామా నిర్వహించారు. అనంతరం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యాధికారులు పోస్టుమార్టం పూర్తి చేసి, మృతదేహాలను పోలీసులు బంధువులకు అప్పచెప్పారు. 3 అంబులెన్స్‌లలో ఆ మృతదేహాలను స్వగ్రామం స్టువర్టుపురం తీసుకుని వెళ్లారు. మార్కాపురం డీఎస్పీ యూ.నాగరాజు, రూరల్ సీఐ రామకోటయ్య, కొమరోలు ఎస్సై నాగరాజు, పలు స్టేషన్ల అధికారులు పర్యవేక్షించారు. ప్రమాదంలో గాయపడి గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గజ్జల భవాని కుమార్తె శిరీష, కుమారుడు సిద్దును మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. శిరీషకు కాలర్ బోన్ విరగ్గా, సిద్దు తలకు చిన్నపాటి గాయం కావడంతో చెవి నుంచి రక్తం వస్తుండడంతో గుంటూరుకు తరలించారు.

## నేడు నేత్ర వైద్య శిబిరం

గిద్దలూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 25వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు శంకర నేత్ర వైద్యాలయం ఆధ్వర్యంలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలు, పెద్దలు, వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఓటరు కార్డు జిరాక్స్ కాపీలను తెచ్చుకోవాలని సూచించారు.

## సైనిక్ స్కూల్ ఫలితాలలో విద్యార్థికి ర్యాంక్



యగ్నేష్

కంభం, మే 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో కంభానికి చెందిన విద్యార్థి కనుమర్లపూడి యగ్నేష్ సెంట్రల్ ఫలితాలలో 1946వ ర్యాంక్, రాష్ట్ర స్థాయిలో 36వ ర్యాంక్ సాధించినట్లు తల్లిదండ్రులు కనుమర్లపూడి బాలచంద్రుడు, వాసవి తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న యగ్నేష్ 7వ తరగతిలో చేరేందుకు సైనిక్ స్కూల్ పరీక్షలో విజయం సాధించాడు. హెచ్ఎం శేఖర్ విద్యార్థిని అభినందించారు.

## మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఎర్రగొండపాలెం, మే 24 (ఆంధ్రజ్యోతి) : 2025-26 సంవత్సరానికి సంబంధించి కలెక్టర్, మేజిస్ట్రేట్, ప్రకాశం జిల్లా ఒంగోలు వారి ఆదేశాల మేరకు త్రిపురాంతకం మండలంలోని మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాలకు అప్లికేషన్లు ఓబీఎంఎంఎస్‌లో దరఖాస్తు చేసుకోవాలని త్రిపురాంతకం ఎంపీడీవో రాజ్‌కుమార్ శనివారం తెలిపారు. గ్రామ సచివాలయం, మీ సేవా, ఏపీ ఆన్‌లైన్ లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాల కోసం మండల పరిషత్ కార్యాలయం, గ్రామ సచివాలయాల్లో సంప్రదించాలని ఎంపీడీవో రాజ్‌కుమార్ తెలిపారు.



యోగాసనాలు వేస్తున్న అధికారులు

## యోగాతో ఆరోగ్యం

పొదిలి, మే 24 (ఆంధ్రజ్యోతి) : యోగాతో ఎంతో ఆర్యోంగా ఉంటారని నగరపంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి అన్నారు. శనివారం జూనియర్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగా చేయాలన్నారు. 11వ అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో భాగంగా శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. జూన్ 21వ తేదీ వరకు యోగా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. శిక్షకులు అప్పల శంకర్ పలురకాల ఆసనాలను వేయించారు. కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు వేసిన ఆసనాలు ఆకర్షించాయి. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావ్, పలువురు విశ్రాంత ఉద్యోగులు, వాకర్స్ వ్యాపారులు పాల్గొన్నారు.

### యోగాంధ్రపై ఇంటింటి సర్వే

బేస్తవారపేట : బేస్తవారపేట మండలంలోని జగ్గంబొట్ల కృష్ణాపురం గ్రామంలో జరుగుతున్న యోగాంధ్ర సర్వేను శనివారం ఎంపీడీవో ఏవీ రంగనాయకులు ఇంటింటికీ వెళ్లిఎ పరిశీలించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులపై కూలీలలో మాట్లాడారు. మెరుగైన వేతనం రావాలంటే అధికారులు సూచించిన కొలతలు ప్రకారం పనిచేయాలని అన్నారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది సకాలంలో వస్తున్నారా, రావడంలేదా అనే అంశాన్ని పరిశీలించి హాజరు పట్టిని పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో గురుకుమార్, కార్యదర్శి మనోరాజ్ పాల్గొన్నారు. సాయంత్రం బేస్తవారపేట మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర 2025 కార్యక్రమంపై వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీతేంద్ర, ఎంఈవో రమణారెడ్డి, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## సబ్ జైలును తనిఖీ చేసిన న్యాయాధికారి



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి షేక్ ఇబ్రహీంషరీఫ్

గిద్దలూరు టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ ఇబ్రహీంషరీఫ్ శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా విచారణ ఖైదీల కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమాజంలో జరుగుతున్న ఘటనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆవేశం అనర్థాలకు కారణమని, చట్ట వ్యతిరేక పనులు చేసినపుడు శిక్షార్హులు అవుతారని ఖైదీలకు వివరించారు. అరెస్టు, బెయిల్ గురించి అవగాహన కల్పించారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలు, ఆహారం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.భరత్‌చంద్ర, సబ్ జైలు సూపరింటెండెంట్ లింగారెడ్డి, న్యాయవాది రవిప్రకాశ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## డిజైన్ స్లేట్ కార్మికుల చర్చలు సఫలం

» పెరిగిన కూలి రేట్లు » పలు అంశాలపై కుదిరిన ఒప్పందం



ఒప్పందపత్రాన్ని అందుకుంటున్న కార్మికులు

మార్కాపురం వన్ టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామికవాడలో డిజైన్ స్లేట్ కార్మికులు, యాజమాన్యం మధ్య జరిగిన చర్చలు సఫలమై కార్మికులకు కూలి రేట్లు పెరిగాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫి, డిజైన్ స్లేట్ యూనియన్ కార్యదర్శి రూబెన్ శనివారం మాట్లాడుతూ..ఈనెల 4న కార్మికులు కూలిని పెంచాలని యజమానులకు నోటీసులు ఇచ్చారని, యజమానులు, కార్మికులకు మధ్య 4 సార్లు చర్చలు జరిగాయని తెలిపారు. శనివారం జరిగిన చర్చల్లో యజమానులు, కార్మికులు కూలి రేట్లు పెంచేందుకు అంగీకరించి ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. ఆపరేటర్‌కు రూ.297 నుంచి రూ.329, హెల్పర్‌కు రూ.294 నుంచి రూ.326, చీల్పుల వారికి రూ.320 నుంచి రూ.350, మొజాయిక్ కార్మికులకు పాతరేటు మీద 11శాతం పెంచారని వివరించారు. క్యాలిబ్రేషన్ కార్మికులకు రూ.150 నుంచి రూ.166 పెంచేందుకు అంగీకారం జరిగిందని, ఈ ఒప్పందం 2 సంవత్సరాలు అమలులో ఉంటుందని తెలిపారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు, డబల్ డ్యూటీ చేసిన కార్మికులకు భోజనానికి రూ.60 చెల్లింపు, గతంలో అమలులో ఉన్న ప్రొడక్షన్, అన్ని రకాల సౌకర్యాలు యథావిధిగా అమలు చేసేలా ఒప్పందం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిజైన్ స్లేట్ స్టోన్ మ్యానుఫ్యాక్చర్స్ అసోసియేషన్ నాయకులు వెన్నా పోలిరెడ్డి, లక్ష్మీనారాయణ, దుర్గా ప్రసాద్, వై.కోటేశ్వరరావు, మోరా వెంకట్ రెడ్డి, ఎంపీ రామ్స్, కార్మికుల యూనియన్ ప్రతినిధులు నాగూర్, వెంకటేశ్వరరెడ్డి, ప్రకాశ్, శేషగిరి, శీను, తిరుపాలు, మాబూ, అనూష, కీర్తన, కాశమ్మ, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## చలో పొదిలికి తరలిరావాలి

గిద్దలూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులకు సంఘీభావంగా ఈనెల 28వ తేదీన వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలికి వస్తున్నారు. ఆ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం చలో పొదిలి కరపత్రాలను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణశాఖ అధ్యక్షుడు మానం బాలిరెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు బత్తెం ఓబులరావు, నాయకులు డాక్టర్ భూమా నరసింహారెడ్డి, బీవీ కృష్ణారెడ్డి, చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, పోలేపల్లి శివ, బాలు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



వినియోగదారుడికి రసీదును అందజేస్తున్న ఆర్టీసీ డీఎం చంద్రశేఖర్

## కొమరోలులో ఆర్టీసీ కార్గో సేవలు

కొమరోలు, మే 24 (ఆంధ్రజ్యోతి) : కార్గో సేవలను ప్రజలు వినియోగించుకోవాలని గిద్దలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ చంద్రశేఖర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర మీసేవా సెంటర్‌లో శనివారం నుంచి ఏపీఎస్ ఆర్టీసీ కార్గో సేవలను ఆయన ప్రారంభించారు. తొలుత కార్గో సేవలను ప్రారంభించిన ఆయన వినియోగదారుడికి రసీదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిద్దలూరు డిపో పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో కార్గో కొరియర్, పార్సిల్స్‌ను బుక్ చేసేందుకు ఏజెంట్లను నియమించామన్నారు. కార్గో సర్వీస్ ద్వారా 24గంటల్లో సామగ్రి, పార్శిళ్ల సంబంధిత చిరునామాకు అందజేస్తారన్నారు. కొమరోలులో ప్రత్యేకంగా బుకింగ్, రిసీవింగ్ పార్సిల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గిద్దలూరు నుంచి వచ్చే ప్రతి బస్సును చెక్‌పోస్టు వరకు పొడిగించామన్నారు. రాత్రి సమయంలో కాచిగూడ రైలు టైంలో ఆర్టీసీ బస్సులేక పోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సివస్తుందని, ఆ సమయంలో రైల్వే స్టేషన్ నుంచి కొమరోలు చెక్‌పోస్టు వరకు బస్సును కొనసాగించాలని, గిద్దలూరు, మోటు, కొమరోలుకు బస్సును, కంభం - కొమరోలు - పోరుమామిళ్లకు బస్సులను, కొమరోలు బస్టాండులో కంట్రోల్‌ను ఏర్పాటు చేసి బస్సుల్లో వెళ్లేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విలేకరులు అడిగారు. అందుకు డీఎం స్పందిస్తూ సాధ్యమైనంతవరకు త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారివెంట డీసీసీ పీ మల్లేశ్వరరెడ్డి, కార్గో ఏజెంటు ముత్తుముల రాజేశ్వరి పాల్గొన్నారు.

## మహిళలు ధైర్యంగా ఎదుర్కోవాలి

జూనియర్ సివిల్ న్యాయాధికారి

గిద్దలూరు టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : సమస్య నుంచి పారిపోకుండా మహిళలు ధైర్యంగా పరిస్థితిని ఎదుర్కోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఏ ఓంకార్ అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో పని ప్రదేశంలో మహిళలకు లైంగిక వేధింపుల నిషేధ చట్టం 2013 గురించి ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయగా సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన జూనియర్ సివిల్ జడ్జి ఓంకార్ ఈ చట్టంకు ఉన్న ప్రాధాన్యతను తెలిపారు. మహిళలు పని ప్రదేశంలో వేధింపులకు గురైతే ధైర్యంగా సమస్యను ఎదుర్కొని తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. మహిళలకు సంబంధించిన ఉచిత టోల్ ఫ్రీ నెంబర్లను ఓంకార్ తెలియచేశారు. మహిళల రక్షణ కోసం చట్టాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. సమాజంలోని స్త్రీలకు గౌరవం అందించాలన్నారు. వారిపట్ల వివక్ష కూడదన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రవిప్రకాశ్, చల్లగాలి పోలయ్య, మోడి పిచ్చయ్య, షేక్ ఫాజిల్, ఎస్.అహల్య, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

## పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

ఎమ్మెల్యే నారాయణరెడ్డి



బోర్డులో పొగాకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి


పొదిలి, మే 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. శనివారం పొగాకుబోర్డును ఆయన సందర్శించి, ధరలపై రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. ప్రస్తుతం పొగాకు బోర్డులో ఉన్న సంక్షోభాన్ని నివారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన మేరకు పొగాకుబోర్డుకు వచ్చినట్లు కందుల తెలిపారు. గిట్టుబాటు ధర లేదని అన్ని విధాలా ఇబ్బందులుపడుతున్నామని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గతంలో కిలో పొగాకు ప్రారంభ ధర రూ.230 నుంచి రూ.300 ఉండేదని, ప్రస్తుతం రూ.280 ఇచ్చి రానురాను రూ.200, రూ.220కి తీసుకొచ్చారని తెలిపారు. గత ఏడాది లోగ్రేడ్ ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేశారని ప్రస్తుతం లోగ్రేడ్‌ను కొనుగోలు చేయకపోవడంతో బోర్డుకు తెచ్చి తిరిగి వెనక్కి తీసుకెళ్తున్నామని రైతులు తెలిపారు. అసలు ధర లేకపోవడానికి గల కారణాలను వేలం నిర్వహణాధికారి గిరి రాజ్‌కుమార్‌తోపాటు కంపెనీ కొనుగోలు దారులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలు విన్న ఆయన కొనుగోలు దారులైన 11 కంపెనీ ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడారు. పొగాకు రైతులకు తప్పకుండా గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. స్పందించిన కంపెనీ ప్రతినిధులు సోమవారం నుంచి ధరల పెరుగుదలకు సహకరిస్తామని చెప్పినట్లు ఆయన చెప్పారు. లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేయరన్న భయంలో రైతులు ఉన్నారని పర్సంటేజీని పెంచి అన్ని రకాలు కొనుగోలు చేయాలని కోరినట్లు ఆయన చెప్పారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, న్యాయం చేస్తామని ఎమ్మెల్యే కందుల భరోసా ఇచ్చారు. ఈ ప్రాంతంలో 11 మిలియన్‌ల పొగాకు కొనుగోలుకు మాత్రమే అనుమతి ఉందన్నారు. అయితే 18 మిలియన్‌ల పొగాకు పండించినట్లు చెప్పారు. మొత్తం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరో వచ్చి చెప్పే మాయమాటలు విని ఆందోళన చెందవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సోమవారం నుంచి కొనుగోలు చర్యలు చేపడతారని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## మనుమంతునికి విశేష పూజలు

తర్లుపాడు, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సీతానాగులవరంలోని శ్రీ వీరాంజనేయస్వామి జయంతి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు పీ వెంకటాచార్యులు, రాఘవాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామివారికి చందనంతో అలంకరించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ధర్మపత్ని వసంతలక్ష్మి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామికి పూజలు చేస్తున్నారు. ఈ సంద ర్భంగా పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు.

## చేతిరాతపై శిక్షణ

మార్కాపురం వన్‌టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : అభ్యాసంతో చేతిరాత, నైపుణ్యం పెంచుకోవచ్చని హ్యాండ్ రైటింగ్ శిక్షకుడు తిరుపాలయ్య అన్నారు. శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేతిరాత శిక్షణ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపాలయ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చేతిరాతను అభివృద్ధి చేసుకోవచ్చని శిక్షణ ద్వారా గుండ్రని అక్షరాలు రాయడం సాధ్యమన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టీవీ రామకృష్ణారావు విద్యార్థులకు చేతివ్రాత సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు శివారెడ్డి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్ల మూలవిరాట్

## చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు

మార్కాపురం వన్‌టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని శ్రీ రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, అర్చనలు నిర్వహించారు. రాజ్యలక్ష్మి అమ్మవా రి మూలవిరాట్‌కు కుంకుమార్చన, అలంకరణలు నిర్వహించారు. నిత్య పూజలు అందుకునే శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులు రాజ్యలక్ష్మి అమ్మవారి ఉత్సవ మూర్తులకు విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. చెన్నకేశవస్వామి ఆలయ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కల్పించారు.

## దేవాలయానికి విరాళం

గిద్దలూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో నిత్య ధూపదీప నైవేద్యం కోసం రూ.12వేల విరాళాన్ని అందజేశారు. నందివెలుగు గ్రామానికి చెందిన దాత పోలేపల్లె చంద్రశేఖర్ కుమారుడైన మంజునాథ్ విరాళాన్ని అందచేసినట్లు దేవస్థాన కమిటీ ప్రతినిధులు తెలిపారు.

## బోల్తా పడిన కూరగాయల లారీ

డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు



లారీ బోల్తా పడడంతో రోడ్డుపై ఉన్న టమాటాలు

పెద్దారవీడు, మే 24 (ఆంధ్రజ్యోతి) : కూరగాయల లారీ బోల్తా పడి ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని దేవరాజుగట్టు సమీపంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పలమనేరు మున్సిపల్ ఛైర్మన్ షేక్ జాఫర్‌కు చెందిన ర్యాలీ చెంచిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి ఒడిశాలోని బిలాస్‌పూర్‌కు కూరగాయాల లోడ్‌తో వెళ్తోంది. దేవరాజుగట్టు సమీపంలో శనివారం తెల్లవారి 5 గంటల సమయంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లినర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై అనిల్‌కుమార్ కేసు నమెదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కాపునాడు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా కృష్ణవేణి





కాపునాడు నూతన కమిటీ సభ్యులు

మార్కాపురం వన్‌టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : కాపునాడు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా సిద్ధం కృష్ణవేణి నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా కాపునాడు అధ్యక్షురాలు మంచాల కవిత మాట్లాడుతూ.. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కాపు మహిళలను అన్ని విధాలా అభివృద్ధి చేయడం కోసం రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు పోగుల మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి దాసరి పిచ్చయ్య నాయుడు, జిల్లా యూత్ అధ్యక్షుడు బండారు సురేశ్‌తో చర్చించిన అనంతరం సిద్ధం కృష్ణవేణిని నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 4 మండలాలల్లో మహిళా కాపునాడు అధ్యక్షురాళ్లను త్వరలో నియమిస్తామని, కాపునాడు సమావేశాలు నిర్వహించి మహిళల సమస్యలను తెలుసుకుని వాటి పరష్కారానికి కృషి చేస్తామన్నారు.

### యోగాతో మానసిక ప్రశాంతత

పామూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు క్రమంతప్పకుండా యోగా సాధనాలు చేయడం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు ప్రశాంతత సమకూరుతుందని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయలంలో ఇంటర్నషనల్ యోగా కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. యోగాతో కలిగే ఉపయోగాల గురించి వివరించారు. సమావేశంలో ఏపీఎం జి.విద్యాసాగర్, ఏపీవో బి.మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

### పశువుల నీటితొట్ల నిర్మాణాలు పూర్తి

పామూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): పశువుల నీటి తొట్ల నిర్మాణ పనులు పామూరు, సీఎస్‌పురం మండలాల్లో పూర్తయినట్టు ఏపీవోలు బి.మాల్యాద్రి, శ్రీనివాసనాయక్ తెలిపారు. మండలంలోని చింతలపాలెంలో జరుగుతున్న పశువుల నీటితొట్ల పనులను శనివారం వారు పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కింద ప్రతి నీటితొట్టి నిర్మాణానికి రూ.32 వేలు నిధులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. పామూరు మండలంలో 37, సీఎస్‌పురం మండలంలో 48 నీటి తొట్లు మంజూరు చేశారని తెలిపారు. పశువుల దాహార్తి తీర్చేందుకు ప్రతిరోజు తొట్లలో నీటిని నింపుతున్నట్టు తెలిపారు.

### నిబంధనల మేర పనిచేస్తే గరిష్ఠ వేతనం

పీసీపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో నిబంధనలమేర పనిచేస్తే రోజుకు రూ.307 గరిష్ఠ వేతనం పొందవచ్చునని ముద్దపాడు టెక్నికల్ అసిస్టెంట్ హరీష్ అన్నారు. మండలంలోని పెద్దన్నపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయాలని అన్నారు. జాబ్‌కార్డు కలిగిన వారు మాత్రమే పనులకు రావాలన్నారు. ఆయనవెంట ఫీల్డ్ అసిస్టెంట్ విష్ణు, తదితరులు ఉన్నారు.

### సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్‌కు ఉద్యోగోన్నతి

తాళ్లూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : తాళ్లూరు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కేవీ ప్రసాద్ డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగోన్నతి పొందారు. కనిగిరి తహసీల్దార్ కార్యాలయానికి రీసర్వే డీటీగా బదిలీ చేస్తూ జిల్లా అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

### కూరగాయల లారీ బోల్తా

పెద్దారవీడు, మే 24 (ఆంధ్రజ్యోతి) : కూరగాయల లారీ బోల్తా పడి ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని దేవరాజుగట్టు సమీపంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి ఒడిశాలోని బిలాస్‌పూర్‌కు కూరగాయాల లారీ వెళ్తోంది. దేవరాజుగట్టు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లినర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఎస్సై అనిల్‌కుమార్ ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమెదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### సైనిక్ స్కూల్ ఫలితాలలో విద్యార్థికి ర్యాంక్

కంభం, మే 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో కంభానికి చెందిన విద్యార్థి కనుమర్లపూడి యగ్నేష్ సెంట్రల్ ఫలితాలలో 1946వ ర్యాంక్, రాష్ట్ర స్థాయిలో 36వ ర్యాంక్ సాధించినట్లు తల్లిదండ్రులు కనుమర్లపూడి బాలచంద్రుడు, వాసవి తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న యగ్నేష్ 7వ తరగతిలో సైనిక్ స్కూల్‌లో చేరేందుకు పరీక్ష రాశారు.

# మరమ్మతులకు నోచుకోని పైప్‌లైన్

- తరచూ లీకేజీలు
- వృథాగా పోతున్న సాగర్ జలాలు
- ప్రజలకు తప్పని మంచినీటి ఇబ్బందులు



చందవరం వద్ద పైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న సాగర్ నీరు

దొనకొండ, మే 24(ఆంధ్రజ్యోతి): దొనకొండ మండలంలోని గ్రామాల ప్రజలకు మంచినీటి సరఫరా నిమిత్తం నిర్మించిన మంచినీటి పథకం శిథిలావస్థకు చేరింది. తరచూ పైప్‌లైన్ లీకేజీలు, పైపులు పగలటం తదితర మరమ్మతులకు గురవుతుండటంతో ప్రజలకు మంచినీటి ఇబ్బందులు ఎదురవుతున్నా యి. ప్రతినిత్యం ఏదో ఒక ప్రాంతంలో పైప్‌లు పగలటం, సిబ్బంది గుర్తించి మరమ్మత్తులు చేపట్టేసరికి వారం రోజులు పట్టటం పరిపాటైంది. తాజాగా చందవరం గ్రామ సమీపంలోని బత్తాయితోటలో పైపలైన్ లీకై నీరు మొత్తం వృథాగా పోతుంది. చందవరం ప్రాంతంలోని దాదాపు పది మంది రైతులకు చెందిన 40 ఎకరాల బత్తాయితోట మధ్యలో సాగర్‌నీటి పైప్‌లైన్ ఉంది. తరచూ పైపులు పగలటం, పైపులు లీకై నీరు మొత్తం బత్తాయి చెట్ల చుట్టూ నిండుకోవటంతో పంట దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. తమ తోటలో పైపలైన్ తొలగించకుంటే మరోసారి పైపులు పగిలినా, లీకులకు గురైనా తాము మరమ్మతులు చేపట్టనీయమని రైతులు పేర్కొంటున్నారు.

దొనకొండ ప్రధాన రహదారి పక్కన అనేక ప్రాంతాల్లో పైపులు లీకై సాగర్ జలాలు వృథాగా పోతున్నాయి. ఈపైప్‌లైన్ సమస్య కారణంగా వారానికి ఒకసారి, ఒక్కోసారి పది రోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల సమయంలో దొనకొండ సమీపంలోని బాదాపురం చెరువును మంచినీటి స్టోరేజీగా ఏర్పాటుచేసి ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని పాలకులు ప్రకటించటమే తప్పా ఆచరణలో అమలు జరగటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని ప్రజల దాహార్తి నిమిత్తం 1982లో నెదర్లాండ్ ఆర్థిక సహాయంతో 885 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో చందవరం సమీపంలో సాగర్ జలాల స్టోరేజీని నిర్మించారు. స్టోరేజీ నిర్మించి దాదాపు 43 సంవత్సరాలు గడుస్తుండటంతో నిర్వహణ బాగోగులు లేకపోవటంతో శిథిలావస్థకు చేరుకుంది. పైప్‌లైన్ పాడైపోయి ఆపసోపాల నడుమ పథకం కొనసాగుతుంది. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి ప్రజల మంచినీటి ఇబ్బందులను గుర్తించి ఎన్‌ఏపీ మంచినీటి పథకానికి నూతన పైప్‌లైన్ మంజూరు చేయించి గ్రామాల్లో ప్రజలకు నీటి సరఫరాకు ఇబ్బందిలేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి గొట్టిపాటి రవికుమార్



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం 51 మందికి రూ.51 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందినవారు అనారోగ్యం పాలైన సమయంలో సీఎం సహాయనిధి ఓ ఉపశమనం అని అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ, మరోపక్క అనారోగ్యలతో వైద్యం చేయించుకోలేక పేద కుటుంబాలు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వం వారికి సీఎం సహాయనిధి ద్వారా వైద్య ఖర్చులను భరించి భరోసాగా నిలుస్తుందన్నారు. ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యం అంటే పేద కుటుంబాలు భయపడే పరిస్థితి ఉన్న సమయంలో ఎమ్మెల్యే ఉగ్ర వారికి అండగా నిలబడి సీఎం సహాయనిధి ద్వారా వారికి వైద్య ఖర్చులు వచ్చేలా చేస్తుండటం అభినందనీయమన్నారు. దరఖాస్తు చేసే ప్రక్రియ నుంచి సీఎం సహాయనిధి వచ్చేవరకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపటం హర్షించదగిన విషయమన్నారు. కనిగిరి అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తూనే ప్రజాసంక్షేమాన్ని కాంక్షిస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను కనిగిరి ప్రాంత ప్రజలు విస్మరించరాదన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నవారు పూర్తివివరాలతో కార్యాలయంలో దరఖాస్తు అందజేస్తే అర్హులైన వారికి సీఎం సహాయ నిధి ద్వారా నగదు అందించి తోడ్పాటునందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మహానాడుకు తరలిరావాలి



రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ రాజేష్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, డాక్టర్ లలిత్‌సాగర్

దర్శి, మే 24 (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే మహానాడుకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డి.రాజేష్‌ను డాక్టర్ లలితసాగర్, మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు సన్మానించారు. ఈసందర్భంగా లలిత్‌సాగర్ మాట్లాడుతూ ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో నిర్వహిస్తున్న మహానాడును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, టీడీపీ పట్టణాధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, దర్శి, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల టీడీపీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, మోడి ఆంజనేయులు, పిడతల నెమలయ్య, మేడగం వెంకటేశ్వరరెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



దర్శిలో కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై నిలిచిన నీరు

## దర్శిలో భారీ వర్షం

దర్శి, మే 24 (ఆంధ్రజ్యోతి) : దర్శి ప్రాంతంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి పట్టణంలోని రోడ్ల జలమయమయ్యాయి. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో రోడ్డుపై పెద్దఎత్తున నీరు నిలిచి ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. వాహనచోదకులు ఆ నీటిలో వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు.

మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడంవల్ల వర్షపు నీరు రోడ్లపైకి చేరింది. ప్రస్తుతం మున్సిపాల్టీగా అప్‌గ్రేడ్ అయినందున డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



# వైభవంగా ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల



ప్రభపై నుంచి మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పువీరాయపాలెంలో శనివారం శ్రీప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ పూజారులు స్వామివారికి అభిషేకం, లక్షతమలార్చన తదితర పూజలు చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ దంపతులు ఈఉత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు. స్వామి వారికి మహిళలు పొంగళ్ల పొంగించి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో భారీ విద్యుత్ ప్రభను ఏర్పాటుచేశారు. భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## కేసులు నమోదు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): జరుగు మల్లి మండలం కె.బిట్రగుంటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బొమ్మ ఊరేగింపును అడ్డుకున్న వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలు పుర నాయకులు కోరారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సం ఘం(కేవీపీఎస్) ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి వి.మోజేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధానకార్యదర్శి బి.రఘురాం మాట్లాడుతూ ఈ ఘటన జరిగిన 40 రోజులు గడుస్తున్నా రాజకీయ వత్తిళ్ళ కార ణంగానే ఇంతవరకు పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. ఉన్న సమగ్ర విచారణ చేయించి అందుకు బాధ్యులైన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నీలం నాగేంద్రరావు, కొప్పోలు ఏడుకొండలరావు, దాసరి సుందరం, కంకణాల ఆంజనేయులు, డీవీఆర్ కోటి, మేడిది రవి, బంటుపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

### 300 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యం

సీఎస్‌పురం(పామూరు), మే 24 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో 300 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఏపీవో శ్రీనివాసనాయక్ తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిమ్మ, బత్తాయి, మామిడి, జామ, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్ వంటి పంటలు సాగు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని చెప్పారు. పండ్ల తోటల పెంపకానికి జాబ్‌కార్డు కలిగి ఉండాలన్నారు. సన్న, చిన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ, రైతులు 5 ఎకరాలు లోపు, నీటి వసతి కలిగి ఉండాలన్నారు. ఈ అర్హత కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సాగుచేసే రైతుకు ఎకరాకు మూడేళ్లు కలిపి పంటను బట్టి సుమారు లక్ష రూపాయలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. తోటను పెంచుకొనే రైతులకు వారి కుటుంబానికి కేటాయించిన వంద రోజులు వారి మొక్కలు సంరక్షణ చేసుకొనేందుకు వారికే చెల్లిస్తారని అన్నారు. ఆసక్తి కలిగిన రైతులు గ్రామంలోని ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌నుగాని, ఏపీవోనుగాని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

### చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు

మార్కాపురం వన్‌టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని శ్రీ రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, అర్చనలు నిర్వహించారు. రాజ్యలక్ష్మి అమ్మవా రి మూల విరాట్‌కు కుంకుమార్చన, అలంకరణలు నిర్వహించారు. నిత్య పూజలు అందుకునే శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులు రాజ్యలక్ష్మి అమ్మవారి ఉత్సవ మూర్తులకు విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో గొలమారి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. చెన్నకేశవస్వామి ఆలయ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కల్పించారు.

### వీరాంజనేయ స్వామికి విశేష పూజలు

తర్లుపాడు, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతానాగులవరంలో శ్రీవీరాంజనేయస్వామి జయంతి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ప్రధాన అర్చకుడు పి.వెంకటాచార్యులు, రాఘవాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామివారికి చందనంతో అలంకరించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ధర్మపత్ని వసంతలక్ష్మి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామికి పూజలు చేస్తున్నారు. ఈ సంద ర్భంగా పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు.

### చేతిరాతపై శిక్షణ

మార్కాపురం వన్‌టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : అభ్యాసంతో చేతిరాతలో నైపుణ్యం పెంచుకోవచ్చని హ్యాండ్ రైటింగ్ శిక్షకుడు తిరుపాలయ్య అన్నారు. శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేతిరాత శిక్షణ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపాలయ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చేతిరాతను అభివృద్ధి చేసుకోవచ్చని శిక్షణ ద్వారా గుండ్రని అక్షరాలు రాయడం సాధ్యమన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టీవీ రామకృష్ణారావు విద్యార్థులకు చేతివ్రాత సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు శివారెడ్డి పాల్గొన్నారు.

### 6 నుంచి మెగా డీఎస్సీ పరీక్షలు

ఒంగోలు(రూరల్), మే24(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షలు జూన్ 6నుం చి జులై6వ తేదీ వరకు జరుగుతాయని కలెక్టర్ తమీమ్ అన్సారియా తె లిపా రు. శనివారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ఒంగోలు నగర పరిధిలో ఈ పరీక్షల కోసం నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అందులో పేస్ ఇంజనీరింగ్ కళాశాల, రైజ్ కృష్ణసాయి, రైజ్‌కృష్ణ సాయిగాంధీ, క్విజ్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ బేస్డ్ విధానంలో ఈ పరీక్షలు జరు గుతాయని చెప్పారు. కార్యక్రమంలో డీఈవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

### పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

ఒంగోలు విద్య, మే 24 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2003 టీచర్లుగా ఎంపికైన వారందరికీ పాతపెన్షన్‌ను పునరుద్ధరించాలని డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం డిమాండ్ చేసింది. శనివారం ఒంగోలులో జరిగిన సమావేశంలో ఫోరం నాయకులు మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం(సీపీఎస్) ప్రవేశపెట్టక ముందే తమ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైనందున తమకు పాతపెన్షన్ వర్తిస్తుందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కన్వీనర్‌గా కె.సుధాకర్, వి.అనురాధలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తిరుపాల్‌రెడ్డి, నాయుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న సీహెచ్‌వోల దీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు శనివారానికి 26వ రోజుకు చేరాయి. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. గత 26 రోజుల నుంచి దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు ఇప్పటికైనా జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గంటా ప్రసన్న, జీవనజ్యోతి, శైలజ, దీప్తి, కామేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### పట్టపగలు చోరీ

ఒంగోలు క్రైం, మే24(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని జర్నలిస్ట్ కాలనీలో పట్టప గలే ఓ ఇంట్లో చోరీ జరిగింది. దుండగులు 100 గ్రాముల బంగారపు ఆభరణాలు అపహరించుకెళ్లారు. వివరాలలోకి వెళితే.. స్థానిక జర్నలిస్ట్ కాలనీలో రెండో లైన్‌లో శ్రీమంతుల శివకృష్ణ నివసిస్తుంటారు. శనివారం మధ్యాహ్నం ఆయన భార్య రాధిక ఒక్కరే ఉన్నారు. ఆమె ఇంటి ఆవరణలో ఉన్న బాత్‌రూమ్‌లో స్నానం చేసేందుకు వెళుతూ తన బంగారపు ఆభరణాలు ఇంట్లో పెట్టారు. ఆమె తిరిగి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఆభరణాలను చోరీ చేశారని వెంటనే భర్తకు సమాచారం చేరవేశారు. ఈ మేరకు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో శివకృష్ణ ఫిర్యాదు చేశారు. సీఐ విజయకృష్ణ పరిశీలించి విచారణ చేపట్టారు.

### పండ్లతోటలు, పూల మొక్కల సాగుకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరంలో నూరుశాతం రాయితీతో పండ్లతోటలు, పూల మొక్కలు సాగు చేసుకునేందుకు దరఖాస్తులు చేసుకోవాలని డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. మామిడి, జామ, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, నేరేడు, సపోట, కొబ్బరి, చింత, ఆపిల్‌బెర్, డ్రాగన్ ఫ్రూట్, అంజుర, మునగ, మల్లె, రోజ్ తదితర పండ్లు, పూలమొక్కల సాగుకు అవకాశం ఉందన్నారు. జాబ్‌కార్డు ఉండి 0.25 నుంచి 5 ఎకరాలలోపు కలిగిన సన్న చిన్నకారు రైతులు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు భూసార పరీక్షల కార్డు, 1బిఅండల్ సర్టిఫికెట్, సన్న/చిన్న కారురైతు సర్టిఫికెట్ (తహసీల్దార్ అనుమతి) ఉండాలన్నారు. జిల్లాలో 6500 ఎకరాలు లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటివరకు 915 మంది రైతులకు చెందిన 2,670 ఎకరాలను గుర్తించినట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం ఉపాధి పథకం ఏపీవో, ఎంపీడీవో, ప్రోగ్రామ్ అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

### చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

మద్దిపాడు, మే 24(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు సరోజనమ్మ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ముండ్లమూరు మండలం బొప్పూడివారిపాలెంకు చెందిన ఇజం సరోజనమ్మ మరో ఇరువురు మహిళలతో కలిసి మేదరమెట్ల నుంచి వెల్లంపల్లిలో బస్సు దిగారు. వెల్లంపల్లిలోకి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా ఓ వాహనం ఢీకొన్న సంగతి తెలిసిందే. ఆమె శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు మద్దిపాడు పోలీసులు వెల్లడించారు.



| ఉష్ణోగ్రత (అంచనా) 25-5-2025 | గరిష్టం | కనిష్టం |
| --- | --- | --- |
| గుంటూరు | 35 | 27 |
| తెనాలి | 34 | 27 |
| నరసరావుపేట | 35 | 26 |
| బాపట్ల | 34 | 28 |
| రెంటచింతల | 35 | 26 |
| చీరాల | 34 | 28 |

# వేగం.. ప్రమాదం

## నిర్లక్ష్య ప్రయాణాలతో ప్రమాదాలు

- ట్రాఫిక్ రూల్స్ పట్టని వాహనదారులు
- రోడ్డు ప్రమాద మృతుల్లో యువతే అధికం
- హెల్మెట్లతో రక్షణ అంటున్నా పట్టించుకోని బైకర్లు
- ప్రమాదాలు తగ్గించాలన్న లక్ష్యాలు ప్రణాళికలకే పరిమితం





### నియంత్రించలేక.. నైపుణ్యం కొరవడి..

అధిక సీసీ సామర్థ్యం కలిగిన బైక్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఈ బైక్‌లపై ఊహకందని స్పీడ్‌తో వెళ్తూ వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాల భారిన యువకులు, విద్యార్థులు పడుతున్నారు. దీనికి తోడు ఈ మధ్య చాలామంది టీనేజర్స్ కారు డ్రైవింగ్‌పై ఆసక్తి చూపుతున్నారు. గేర్లులేని కార్లు అందుబాటులోకి రావడం వాటిని నడిపే నైపుణ్యం వారిలో లేకపోవడం వంటి కారణాలు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

(గుంటూరు(తూర్పు) - ఆంధ్రజ్యోతి)

- వేగం.. ఆపై నిద్రమత్తు.. బాపట్ల జిల్లా స్టూవర్టుపురంలో ఆరుగుర్ని బలితీసుకుంది.
- రైల్లో వస్తున్న స్నేహితుడ్ని తీసుకువచ్చేందుకు అర్ధరాత్రి వెళ్తూ రోడ్డు పక్కన ఆగిన లారీ చీకట్లో కానరాక ఢీకొని తెనాలి సమీపంలోని అంగలకుదురులో ఓ యువకుడు మృతి చెందాడు.

ఇలా.. శుక్రవారం తెల్లవారుజామున గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పది మంది చనిపోయారు. ఇలా తరచూ జరిగే రోడ్డు ప్రమాదాల్లో ఎందరో మరణిస్తున్నారు. మద్యం మత్తులో, సెల్‌ఫోను మాట్లాడుతూ, రాంగ్‌రూట్ ఇలా అనేక చిన్నపాటి నిర్లక్ష్యాలతో విలువైన ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ప్రమాదం అంటే ఒక వ్యక్తి రోడ్డున పడటం కాదు. ఒక కుటుంబం రోడ్డున పడటం... అని ఓ యువ హీరో ఆవేదన వ్యక్తం చేశాడు. అంటే ఇక సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అత్యంత అప్రమత్తంగా నియమాలకు అనుగుణంగా ఉండాల్సిన ప్రయాణం కొద్దిపాటి నిర్లక్ష్యంతో విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఒకరి నిర్లక్ష్యం అన్నెం, పున్నెం ఎరుగని ఇతరుల ప్రాణాలు పోవడానికి కారణమవుతుంది. ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయేవారు కొందరైతే అవయవాలు కోల్పోయి విగత జీవులుగా మారుతున్న వారు ఎందరో ఉంటున్నారు. రోడ్డు ప్రమాదాలపై ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన వాహనదారుల తీరులో మార్పు కనబడటం లేదు. గత కొంత కాలంగా రోడ్డు ప్రమాదాలు గణనీయంగా పెరిగాయి. మృతుల్లో ఎక్కువ మంది యువకులే ఉండటం మరింత ఆందోళన కల్గించే విషయం. ఏటా రోడ్డు ప్రమాదాల బారిన పడి మృతుల సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. దీనికి తోడు ఏడాదిలో 3 శాతం ప్రమాదాలు తగ్గించాలని పెట్టుకున్న లక్ష్యాలు ప్రణాళికలకు మాత్రమే పరిమితమయ్యాయి.

వేగం.. నిర్లక్ష్యం.. రాంగ్‌రూట్.. ఓవర్‌టేక్.. మద్యం మత్తులో.. ప్రయాణాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఎందరినో బలి తీసుకుంటున్నాయి. జాతీయ రహదారులైనా.. రాష్ట్ర రహదారులైనా.. గ్రామీణ రోడ్లు అయినా వాహనదారులు పట్టించుకోకుండా దూసుకెళ్తూ మృత్యు దరికి చేరుతున్నారు. జనసంచారం ఉన్నా.. రద్దీ మార్గాలైనా.. ట్రాఫిక్ రూల్స్‌ను వాహనదారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. దీంతో వాహనాలు ఢీకొని ఎందరో మరణిస్తుండగా వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. తీవ్రగాయాలతో జీవచ్ఛవాలుగా మారుతున్న వారు ఎందరో ఉన్నారు. నిత్యం ఎక్కడో ఒక దగ్గర ప్రమాదాలు చోటుచేసు కుంటున్నా.. ఎందరో మరణిస్తున్నా.. వాహనదారుల్లో నిర్లక్ష్యం మాత్రం తగ్గడంలేదు. ర్యాష్ డ్రైవింగ్.. స్నేక్‌డ్రైవింగ్‌లతో యువత తమతో పాటు రోడ్డుపై వెళ్తున్న వారిని బలితీసు కుంటున్నారు. 2025లో గుంటూరు జిల్లాలో జరిగిన ప్రమాదాల్లో 490 మంది ద్విచక్ర వాహనదారులు మృతి చెందగా వారిలో దాదాపు 70 శాతం వరకు యువకులే ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

### స్పీడ్‌గన్‌తో.. నియంత్రణ

వాహనాల అధిక వేగాన్ని అరికట్టేందుకు స్పీడ్‌గన్‌ను గుంటూరు సమీపంలోని మానససరోవరం వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులు ఈ ప్రాంతంలో నెమ్మదిగా ప్రయాణిస్తుండటంతో ప్రమాదాలు ఇటీవల చాలా వరకు తగ్గాయి. ఇలా స్పీడ్‌గన్‌లతో ప్రమాదాలు నియంత్రించే అవకాశం ఉండటంతో ఇటీవల రెండో స్పీడ్ గన్ ఏర్పాటుకు రవాణా శాఖాధికారులు చర్యలు చేపట్టారు.

# ఆధిపత్య పోరులో.. జంట హత్యలు



వెంకటేశ్వర్లు



కోటేశ్వరరావు

## పల్నాడులో టీడీపీ నేతలు ఇద్దరి హత్య

- బైకుపై వెళ్తుండగా కారుతో ఢీకొట్టి సోదరుల హతం
- వేరే పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన నిందితులు
- జంట హత్యల్లో పిన్నెల్లి సోదరుల హస్తముందన్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి
- నాడు వైసీపీ హయాంలో.. నేడు కూటమి ప్రభుత్వంలో టీడీపీ నేతల హతం

గుంటూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): అసలే పల్నాడు.. ఆపై ఆధిపత్య పోరు. ఎప్పటి నుంచో టీడీపీలో ఉన్న వారు.. ఇటీవల పార్టీ కండువా కప్పుకున్న వారు పెత్తనం కోసం కక్షలు పెంచుకున్నారు. మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో అధికార పార్టీలో ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరుకుంది. ఈ క్రమంలో శనివారం గుండ్లపాడు గ్రామానికి చెందిన తొలి నుంచి టీడీపీలో ఉన్న జెవిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు కోటేశ్వరరావులు హత్యకు గురయ్యారు. వీరిని అదే గ్రామానికి చెందిన తోట వెంకట్రామయ్య, జెవిశెట్టి శ్రీనివాసరావులు కారుతో ఢీకొట్టి హత్య చేశారు. గుండ్లపాడులో వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నేత తోట చంద్రయ్య హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చి సంవత్సరం గడవకముందే టీడీపీ నేతల హత్యతో గుండ్లపాడు ఉలిక్కిపడింది. నాడు వైసీపీ హయాంలోనూ, నేడు టీడీపీ నేతృత్వ కూటమి ప్రభుత్వంలోనూ టీడీపీ నేతల హత్యకు గురికావడంతో ఆ పార్టీ వర్గీయుల్లో ఆందోళన నెలకొంది. గుండ్లపాడు గ్రామ టీడీపీలో చంద్రయ్యతో పాటు ఆది నుంచి జెవిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు కోటేశ్వరరావు కీలకంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. చంద్రయ్య హత్యానంతరం వెంకటేశ్వర్లు పార్టీలో ముఖ్యపాత్ర తీసుకున్నారు. అయితే గతంలో వేరే పార్టీలో ఉన్న తోట వెంకట్రామయ్య వర్గం టీడీపీలో చేరింది. గ్రామంలో రాజకీయ ఆధిపత్యం కోసం వెంకట్రామయ్య ఎంతో కాలంగా ప్రయత్నిస్తున్నారు. అయితే జెవిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ మొద్దయ్యకు గ్రామంలో పట్టు ఉంది. ఈ క్రమంలో జెవిశెట్టి సోదరులు ఉన్నంతవరకు గ్రామంలో తన ఆధిపత్యం నడవదని వెంకట్రామయ్య భావించాడు. ఈ క్రమంలోనే సోదరుల హత్యకు పథకం రూపొందించాడని తెలుస్తోంది. దీనికితోడు రెండు నెలల క్రితం గ్రామానికి చెందిన వెంకట్రామయ్య వర్గీయుడైన ఉప్పుతోళ్ల శ్రీనివాసరావుపై టీడీపీలోనే ఓవర్గం దాడి చేసికాళ్లు విరగొట్టింది. ఆదాడికి పాల్పడిన నిందితులకు జెవిశెట్టి వెంకటేశ్వర్లు వర్గం మద్దతుగా నిలిచింది.



ఎమ్మెల్యేకు ఘటన గురించి వివరిస్తూ విలపిస్తున్న కుటుంబ సభ్యులు

### గ్రామ పెద్దగా ప్రకటనతో కంటగింపు

రెండు రోజుల క్రితం ఎస్పీ శ్రీనివాసరావు గ్రామంలో పల్లెనిద్రకు వచ్చారు. గ్రామంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా వెంకటేశ్వర్లును సంప్రదించాలని గ్రామస్థులకు సూచించారు. ఆయా ఇబ్బందులను వెంకటేశ్వర్లు తమ దృష్టికి తీసు కొస్తారని ఆయనను ఎస్పీ గ్రామ పెద్దగా ప్రకటించారు. ఈ క్రమంలో ఎస్పీ ప్రకటన నిందితులకు కంటగింపుగా మారింది. శ్రీనివాసరావు కాళ్లు విరగ్గొట్టడం, ఆపై ఎస్పీ కూడా వెంకటేశ్వర్లను గ్రామస్తులు అనుసరించాలని చెప్పడంతో తోట వెంకట్రామయ్యకు రుచించలేదు. ఈ నేపథ్యంలోనే వెంకటేశ్వర్లు, కోటేశ్వరావులను అడ్డుతొలగిస్తే గ్రామంలో ఎదురుండదని భావించి వారిని హత్య చేశారని సమాచారం.

### గ్రామానికి వస్తుండగా కారుతో ఢీకొట్టి..

జెవిశెట్టి వెంకటేశ్వర్లు, సోదరుడు కోటేశ్వరరావు, అల్లుడు తోట ఆంజనేయులుతో పాటు సుమారు 12 మంది ద్వి చక్ర వాహనాలపై తెలంగాణలో ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మిగిలిన వారు మాచర్లలో టీ తాగేం దుకు ఆగగా వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు ద్విచక్ర వాహనంపై గ్రామానికి వస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న వెంకట్రామయ్య, జెవిశెట్టి శ్రీనివాసరావు, అలియాస్ బొబ్బిలితో పాటు మరో ఇద్దరు కారులో గుండ్లపాడు నుంచి మాచర్లకు వచ్చే మార్గంలో ఎదురుగా వెళ్లి భోజనవీడు మండాది గ్రామాల మధ్యలో సోదరులు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో సోదరులు ఎగిరి 100 అడుగుల దూరంలో పడి మృతి చెందారు. ఈ ఘటన జరిగిన పది నిమిషాల తర్వాత వెనుకగా వెంకటేశ్వర్లు అల్లుడు తోట ఆంజనేయులు ద్విచక్ర వాహనంపై రాగా అతడ్ని చూసి నిందితులు కారును అక్కడే వదిలేసి రచ్చమల్లపాడు వెళ్లే డొంక గుండా పారిపోయారు. నింది తుల్లో ఒకడైన జెవిశెట్టి శ్రీనివాసరావు హతులకు పెదనాన్న కొడుకు కావడం గమనార్హం.



ఎస్పీ శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

### పిన్నెల్లి హస్తంపై ఆరోపణలు

వెంకటేశ్వర్లు సోదరుల హత్యలో వైసీపీ వర్గీయులు, ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి హస్తం కూడా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంకటేశ్వర్లు సోదరుల హత్యతో టీడీపీలోని ప్రత్యర్థి గ్రూపుతో పాటు గ్రామంలో వైసీపీ ఆధిపత్యానికి కూడా ఎదురుండదనే కారణంతోనే జంట హత్యలు జరిగినట్లు టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి. సోదరుల హత్యలో పిన్నెల్లి పాత్ర ఉందని హతుల కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. సమాచారం తెలిసిన వెంటనే సోదరుల కుటుంబంలోని మహిళలు పెద్దసంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. వెంకటేశ్వర్లుకు భార్య అచ్చమ్మ కుమారుడు ఆంజనేయులు, కూతురు అనురాధ ఉన్నారు. కోటేశ్వరరావుకు భార్యగాలమ్మ, కుమారుడు లక్ష్మయ్య ఉన్నారు. ఈ హత్యలతో గ్రామంలో విషాదం నెలకొంది.

### శాంతిభద్రతలకు పిన్నెల్లి విఘాతం : బ్రహ్మారెడ్డి

హైదరాబాదులో ఉన్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి జంట హత్యల విషయం తెలుసుకున్న వెంటనే రాత్రికి గ్రామానికి వచ్చారు. హతుల కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో స్వల్ప వివాదాలను ఆసరాగా తీసుకుని పిన్నెల్లి సోదరులు రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆరో పించారు. వివిధ మండలాల్లో వైసీపీ శ్రేణు లను రెచ్చగొట్టి కవ్వింపు చర్యలకు పాల్పడేటట్లు చేస్తున్నారన్నారు. గ్రామాలు అభివృద్ధి పరచాలని నేను ప్రయత్నిస్తుంటే పిన్నెల్లి సోదరులు హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. జంట హత్యల్లో వారి హస్తం ఉందని, పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. పోలింగ్ ముందు, పోలింగ్ తర్వాత అల్లర్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంలో పోలీసు వ్యవస్థ విఫలమైందని, అందువల్లే సంఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. టీడీపీ కార్యకర్తలను తాను మందలిస్తుండగా, ప్రతి పక్షం రెచ్చగొడుతుందన్నారు.

# మాటలు కాదు.. ఫలితాలు కావాలి

- బర్లీ పొగాకు కొనుగోళ్లపై కంపెనీలకు ఆదేశాలు
- గ్రేడ్ల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదు
- మార్టూరులో రైతులతో ముఖాముఖిలో మంత్రి అచ్చెన్నాయుడు
- ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలు తప్ప వేరే మార్గం లేదన్న రైతులు
- సాగుకు ముందు ధర ఆశ చూపి కంపెనీలు ఇప్పుడు వంచించాయని ఆగ్రహం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) 'మాటలు కాదు.. ఫలితాలు కావాలి. బర్లీ పొగాకు రైతులకు న్యాయం జరగాలి. ఒక్క రైతు మరణం కూడా జరగకూడదు. ధర ఆశచూపి.. కొనుగోళ్లపై హామీ ఇచ్చి ఇప్పుడు ఎందుకు తప్పుకు తిరుగుతున్నారు. ప్రభుత్వం పదేపదే ఆదేశిస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదు. లాభాలు వచ్చినప్పుడే కాదు కష్టాల్లోనూ రైతుకు అండగా కంపెనీలు ఉండాల్సిందే. ఏ ఒక్క రైతు కూడా ధర విషయంలో బేలపడి ఉసురు తీసుకునే పరిస్థితి రావద్దు. కంపెనీలు పూర్తి స్థాయిలో బర్లీ పొగాకును కొనాలి. అప్పటికి ఇంకా మిగిలితే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తాం..' అని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పొగాకు కంపెనీలను ఆదేశించారు. బర్లీ పొగాకు రైతుల కష్టనష్టాలపై మంత్రి అచ్చెన్నాయుడి సారథ్యంలో మార్టూరులో శనివారం ముఖాముఖి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తొలుత రైతులు తమ గోడును సబ్‌కమిటీ ఎదుట వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్య తప్ప వేరే మార్గమే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది కంపెనీల ప్రతినిధులు ఇంటిం టికి తిరిగి బర్లీ పొగాకు సాగు చేయాలని కోరాయని, ప్రస్తుత సంక్షోభానికి కారణం వారేనని రైతులు వాపోయారు. ధర ఆశ చూపి నిలువునా వంచించాయంటూ జీపీఐ కంపెనీ వ్యవహారశైలిపై మండిపడ్డారు. సాగు చేసేటప్పుడు ఓ మాట ఇప్పుడు ఓ మాట మాట్లాడుతున్నారని, ఏజెంట్లు కనీసం తమ ఫోన్లు కూడా ఎత్తడం లేదన్నారు.



ధర దక్కడం లేదని నేతలకు గోడు వెళ్లబోసుకుంటున్న మహిళా రైతు

### మొత్తం కొనాల్సిందే...

సమావేశానికి హాజరైన కంపెనీల ప్రతినిధులు తాము కొనబోయే గణాంకాలను చెబుతున్న క్రమంలో ఇప్పటి వరకు ఎంత కొన్నారని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. రైతుల్లో భరోసా నింపాల్సిందేనని దానికి ఏం చేయగలరో చెప్పండని నిలదీశారు. జీపీఐ 15,000 మిలియన్ కేజీల పొగాకు, ఐటీసీ 8,000 మిలియన్ కేజీల కొనుగోలుకు సుముఖత వ్యక్తం చేయడంతో మిగిలినది ఎవరు కొంటారని ఆయన ప్రశ్నించారు. రైతుల దగ్గర ఉన్న నిల్వలు 70,000 మిలియన్ కేజీలని గణాంకాలు చెబుతుంటే ఈ కోతల లెక్కలెం దుకని మంత్రి ప్రశ్నించారు. చివరి ఆకు వరకు కొనాల్సిందేనని, అందుకు ప్రభుత్వం నుంచి కావాల్సిన సహాయం ఏమిటో కూడా చెప్పాలన్నారు.



పొగాకు రైతుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే ఏలూరి

### ధర విషయంలో ఏలూరి ప్రతిపాదన

రైతులు గ్రేడ్లు చేసే పరిస్థితిలో లేరని కొనుగోలులో రెండే ప్రామాణికాలు ఉండేలా చూడాలని సమావేశానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రతిపాదించారు. లో గ్రేడ్ రకానికి రూ. 5,000 నుంచి రూ.6,000, మీడియం, హై క్వాలిటీ రకానికి రూ.12,000 ధర ఇచ్చేలా చూడాలని మంత్రి ని ఏలూరి కోరారు. పొగాకు సాగును భవిష్యత్తులో అయినా రెగ్యులరేట్ చేయడానికి ఓ సెల్ఫ్ మా నిటరింగ్ బోర్డు ఉండేలా చొరవ తీసుకోవాలన్నారు. మంత్రి రవికుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమను నేరుగా రైతుల వద్దకే వెళ్లి వారి సమస్యలు విని భరోసా కల్పించే చర్యలు తీసుకోవాలని చెప్పారన్నారు. సమావేశంలో వ్యవ సాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు, ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్, టుబాకో బోర్డు ఛైర్మన్ యశ్వంత్, ఏడీ విశ్వసే, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ సురేష్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్, కలెక్టర్ వెంకటమురళి, అధికారులు, పొగాకు కంపెనీల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు.

## సముద్రతీరంలో.. నిఘా నేత్రం

### యాత్రికుల రక్షణ, భద్రతకు ప్రాధాన్యం : ఎస్పీ

బాపట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): యాత్రికుల రక్షణ, భద్రతకు ప్రాధాన్యమిస్తూ తీర ప్రాంతాలలో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. సూర్యలంక, రామాపురం, ఓడరేవు సముద్రతీరాలలో శనివారం డ్రోన్‌లను ఎగురవేసి పరిసరాలను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రతీరంలో నిఘా కోసం డ్రోన్లను ఉపయోగిస్తున్నామన్నారు. తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాలకు పెద్దసంఖ్యలో వచ్చే యాత్రికుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టే ఉద్దేశంతో డ్రోన్‌లతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. యాత్రికులు సముద్రలోతుల్లోకి వెళ్లకుండా డ్రోన్ల ద్వారా గుర్తించడం జరుగుతుందన్నారు. ఎవరైనా ప్రమాదానికి గురైతే వెంటనే గజఈత గాళ్లు, ఔట్‌పోస్ట్, మెరైన్ పోలీసులను అప్రమత్తం చేసి వారిని కాపాడతామన్నారు. యాత్రికులు పోలీసుశాఖ సూచనలు పాటిస్తూ ఆహ్లాదకరంగా గడిపి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు



## ఆయుష్ సభ్యుడిగా ఎంపీ కృష్ణప్రసాద్

### కేంద్ర మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీ



బాపట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ మంత్రిత్వశాఖ సలహాకమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో లోక్‌సభ ప్యానల్ స్పీకర్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌ను శాశ్విత ప్రత్యేక ఆహ్వానిత సభ్యులుగా నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ కమిటీలో తెన్నేటి కీలకబాధ్యతలు నిర్వహించనున్నారు.

### నేషనల్ చాంపియన్‌కు అభినందనలు

బాపట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ కూడో చాంపియన్‌షిప్ పోటీలలో బాపట్లకు చెందిన దివ్యతేజ విజేతగా నిలిచి గోల్డ్‌మెడల్ సాధించారు. మహారాష్ట్రలోని పూణెలో ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకు జరిగిన మూడో నేషనల్ కూడో చాంపియన్‌షిప్ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన దివ్యతేజకు గోల్డ్‌మెడల్ రావటం అభినందనీయమని మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాంబశివరావు అన్నారు.

# పొగాకు రైతులకు న్యాయం చేసేందుకు కృషి

● రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ● సురవరపల్లిలో పొగాకు పంటను పరిశీలన


పొగాకు మండెలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖమంత్రి అచ్చెన్నాయుడు

పర్చూరు/మార్టూరు (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులకు న్యాయం జరిగేలా అన్ని విధాల కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరావు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం యద్దనపూడి మండలం సూరవారిపల్లిలో రైతులు నిల్వచేసుకున్న పొగాకు మండెలను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, పర్చూరు నియోజకవర్గంలో పొగాకు రైతుల సమస్యను స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ద్వారా ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. పొగాకు రైతులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో రాజకీయ యంత్రాంగంతోపాటు, ప్రభుత్వ యంత్రాంగం కూడా కదిలి వచ్చిందన్నారు. రైతుల సంక్షేమమే తెలుగుదేశం ప్రభుత్వ లక్ష్యమని ఆయన గుర్తుచేశారు. అనంతరం మార్టూరు మండలంలోని ఎంఎల్‌ఏపీ కంపెనీని సందర్శించి యాజమాన్యంతో కలసి ప్రాసెసింగ్ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, వ్యవసాయ కమిషనర్ ఢిల్లీ రావు, జిల్లా కలెక్టర్ వెంకట మురళి, ఆర్డీవో గ్లోరియా పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో రైతులు, కంపెనీల ప్రతినిధులతో మంత్రుల బృందం ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు.

## అవీ..ఇవీ..

### సర్వేలను వేగవంతం చేయాలి

వేటపాలెం(చీరాల), మే 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు జరుగుతున్న అన్నిరకాల సర్వేలను వేగంగా పూర్తిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని గ్రామవార్డు సచివాలయ జిల్లా ఇన్‌చార్జ్ అధికారి విజయలక్ష్మీ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని వెలుగు కార్యాలయంలో ఎంపీడీవో రాజేష్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆరేళ్ల లోపే చిన్నారులకు ఆధార్ అందేలా చూడాలన్నారు. రైస్‌కార్డులకు సంబంబంధించి అందజేసిన లాగిన్‌లో త్వరగా డేటా అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, మండల పరిధిలోని సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆటో బైకును ఢీకొనడంతో ఘటన


గాయపడ్డ అశోక్

బల్లికురవ. మే 24 (ఆంధ్రజ్యోతి) : ఆటో, మోటారు సైకిల్‌ను ఢీకొట్టడంతో మోటారు సైకిల్‌పై వస్తున్న యువకుడికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని మల్లాయపాలెం రోడ్డులో శనివారం చోటుచేసుకొంది. మల్లాయపాలేనికి చెందిన అశోక్ అనే యువకుడు తన బైకుపై బల్లికురవ వైపు వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న పాల ఆటో బైకును ఢీకొట్టింది. ఈప్రమాదంలో బైకుపై ఉన్న అశోక్‌కు తీవ్రగాయాలయ్యాయి. అపస్మారక స్థితికి చేరడంతో వెంటనే నరసరావుపేట వైద్యశాలకు క్షతగాత్రుడిని తరలించారు.

### చీరాల్లో బిర్యానీ దొంగలు

చీరాల, మే 24 (ఆంధ్రజ్యోతి) : బిర్యాని తిని బిల్లు ఎగ్గొట్టడంతో ఇద్దరు వ్యక్తులు చేసిన పని అచ్చం సినిమా సన్నివేశాలను తలపించింది. చీరాల పట్టణంలోని ఓ బిర్యాని పాయింట్‌కు శనివారం మధ్యాహ్నం ఇద్దరు స్నేహితులు వచ్చారు. బిర్యానీ ఆర్డర్ చేసుకుని తిన్నారు. ముగిశాక ముందుగా వారిలో ఓ వ్యక్తివాష్ బేసిన్ వద్దకు వెళ్లి చేతులు శుభ్రపరచుకున్నారు. తన మిత్రుడు డబ్బులు కడతాడని చెప్పి వెళ్లిపోయాడు. కొద్దిసేపటికి రెండోవ్యక్తి వాష్‌బేసిన్ వద్దకు వెళ్లి చేతులు శుభ్రపరచుకున్నాడు. ఫ్యాంట్ పైకి లాక్కుని ఒక్క ఉదుటున పరుగులంకించాడు. అయితే గమనించిన దుకాణంలో పనిచేసే యువకుడు దాదాపుగా 300 మీటర్లు వెంబడించాడు. అయినా బిర్యాని దొంగలు కనపడలేదు.

### అనారోగ్యంతో మహిళ ఆత్మహత్యాయత్నం

ఇంటి నుంచి పారిపోయిన మహిళ

వెతికి పట్టుకున్న పోలీసులు

మేదరమెట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లకు చెందిన వివాహిత అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకోవడానికి శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. తన గురించి ఎవరు వెతక వద్దని తాను ఆత్మహత్య చేసుకుంటు న్నానని కుటుంబ సభ్యులకు సందేశం పంపింది. తనభర్త చాల మంచివాడని ఆయనకు మరో వివాహం చేయాలని పేర్కొంది. అనారోగ్య సమస్యల వలన ఆత్మహత్య చేసుకుంటున్నాని లేఖ రాసి ఇంటి నుంచి వెళ్లింది. దీంతో వివాహిత తల్లి మేదరమెట్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే మేదరమెట్ల ఎస్సై బాపట్ల ఎస్పీ తుషార్‌డూడీ దృష్టికి విషయం తీసుకుపోయారు. చీరాల డీఎస్పీ మోయిన్, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావులు మూడు టీంలను ఏర్పాటు చేసి కొత్తపట్నం, చినగంజాం, చీరాల సముద్రతీరాలకు వెళ్లి మహిళ ఆచూకి కోసం వెతికారు. సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో ఆమెను కొత్తపట్నంలో పట్టుకున్నారు. ఆమెను చాకచక్యంగా కాపాడిన పోలీసులకు మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### వైసీపీ ప్రచారవిభాగం సంయుక్త కార్యదర్శిగా అంకారావు

మేదరమెట్ల, మే 24, (ఆంధ్రజ్యోతి) : కొరిశపాడు మండలం మేదరమెట్లకు చెందిన వైసీపీ నాయకుడు కోయి అంకారావును వైసీపీ కేంద్ర కార్యాలయం రాష్ట్ర ప్రచార విభాగం పబ్లిసిటీ విభాగంలో సంయుక్త కార్యదర్శిగా నియమించింది. అంకారావు గతంలో అద్దంకి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. మండలంలో వైసీపీ కీలక నేతల్లో ఒకరుగా ఉన్నారు.

### ముమ్మరంగా విభిన్న ప్రతిభావంతుల సర్వే


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

చీరాల, మే 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సర్వేను ముమ్మరం చేసింది. ఈ సర్వే ద్వారా 0 నుండి 18 సంవత్సరములు వరకు ఉన్న విభిన్న ప్రతిభావంతులైన పిల్లలను గుర్తించి వారికి నాణ్యమైన విద్య, కావాల్సిన పరికరాలు, వినికిడి యంత్రాలు, ట్రై సైకిల్స్ అందించనున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 సుధారాణి మాట్లాడుతూ మే 13 నుంచి జూన్ 9 వరకు సర్వే చేస్తున్నట్లు చెప్పారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని విభిన్న ప్రతిభా వంతులను గుర్తించి భవితా కేంద్రాల ద్వారా స్పీచ్‌థెరపీ, ఫిజియో థెరపీ, స్పెషల్ ఎడ్యుకేషన్‌తో పాటు ఆటిజం లక్షణాలకు చికిత్స అందించనున్నట్లు చెప్పారు. శనివారం నిర్వహించిన సర్వేలో ఎంఈవోతో పాటు దరబడి రాజశేఖర్, వి.నరసింహం పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరు ప్లాస్టిక్‌ను నిషేధించాలి


అవగాహన కల్పిస్తున్న పంచాయతీ సిబ్బంది

చినగంజాం, మే 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు సహకరించాలని కడవకుదురు గ్రామ సచివాలయ 1, 2 గ్రామ కార్యదర్శులు పర్చూరు శ్రీనివాసరావు, మాజేటి వెంకటరమణలు అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, గ్లాసులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధంపై, పారిశుధ్యంపై శనివారం గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తడి, పొడి చెత్త పారిశుధ్యం, నిషేధిత ప్లాస్టిక్‌పై గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శులు తెలిపారు. గ్రామంలోని కిరణా దుకాణాల యజమానులకు, ఇంటింటికి తిరిగి నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించరాదని, అమ్మేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ 1, 2 వెల్ఫేర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

### రేషన్ వాహనాల సిబ్బందిని కొనసాగించాలి

అద్దంకి,మే24(ఆంధ్రజ్యోతి):రేషన్ పంపిణీ వాహనాల (ఎండీయూ)సిబ్బంది శనివారం తహసీల్దార్ శ్రీచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఎలాంటి చర్చలు జరపకుండా ఏకపక్షంగా తొలగించడం దారుణం అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్ అన్నారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, గంగాధర్, కరీమ్, ఎండీయూ వాహనాల సిబ్బంది రాజశేఖర్, జాన్సన్, హరీష్, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వాగులు కాదు..రహదారులే..

● జలమయమైన రహదారులు

● అవస్థలు పడుతున్న ప్రజలు, వాహన దారులు


చీరాల - బాపట్ల ప్రధాన రహదారి


ఈపూరుపాలెం - భావనారుషిపేట రహదారి

ఈపూరుపాలెం(చీరాల), మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈపూరుపాలెం నుంచి చుట్టుపక్కల ప్రాంతాలకు ఎటు వెళ్లాలన్నా, అధ్వానపు రహదారులే దర్శన మిస్తున్నాయి. అసలే ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. దానికి తోడు వరుసగా నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలకు ప్రయాణాలు నరకప్రాయంగా మారుతున్నాయి. చీరాల నుంచి నిత్యం ఈపూరుపాలెం మీదుగా హెవీ, చిన్న తరహా వాహనాలు వందల సంఖ్యలో ప్రయాణం సాగి స్తుంటాయి. ఈ నేపథ్యంలో శిథిలమైన రహదారులు, జలమయ మైన దారులు కారణంగా వాహనదా రులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈపూరుపాలెం నుంచి భావనారుషి పేటకు వెళ్లే మార్గం గోతులమయంగా మారింది. అటువైపు వీధి దీపాలు కూడా లేకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే తోటవారిపాలెం, ఈపూరుపాలెం వైపు నుంచి సాయి కాలనీ వైపు వెళ్లే రహదారులు దారుణంగా ఉన్నాయి. ఘోరంగా దెబ్బతిని గోతులు పెద్దఎత్తున ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలు పట్టించుకోవాలని పాలకులు, అధికారులను కోరుతున్నారు.

## అద్దంకిలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది


అద్దంకిలోకురుస్తున్న వర్షం

అద్దంకి, మే24(ఆంధ్రజ్యోతి): మండు వేసవిలోనూ గత 10 రోజులుగా కురుస్తున్న వర్షపు జల్లులకు వాతావరణం చల్లబడింది. శనివారం పగలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి కాగా రాత్రి 8-30 గంటల సమయం నుండి భారీ వర్షం ప్రారంభమైంది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. గాలులతో విద్యుత్ సరఫరా కు తరచూ అంతరాయం ఏర్పడింది.

**పిడుగుపాటుకు పొగాకు మండెలు దగ్ధం**

పర్చూరు: పిడుగుపాటుకు పొగాకు మండెలు, కొష్టాలు దగ్ధమైన ఘటన మండలంలోని దేవరపల్లిలో శనివారం రాత్రి చోటుచేసు కొంది. రాత్రి 10 గంటల తర్వాత ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో వర్షం కురిసి పిడుగులు పడడంతో తోకల సుబ్బా రావు, తోకల శివనాగేశ్వరరావుకు చెందిన పొగాకు మండెలు, కొష్టాలు దగ్ధమయ్యాయి. చీరాల నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

## పారదర్శకంగా రేషన్‌పంపిణీ


మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

చీరాల, మే 24 (ఆంధ్రజ్యోతి) : జూన్ 1 నుంచి ఇంటింటా రేషన్ పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలని చీరాల మండల తహసీల్దార్ గోపీకృష్ణ, వేటపాలెం మండల తహసీల్దార్ పార్వతి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం వారి కార్యాలయాల్లో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులకు 5వ తేదీలోపే వారి ఇళ్లకు రేషన్ చేరాలన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గం.నుండి 8గంటల వరకు పంపిణీ చేయాలని సూచించారు. అధికారుల తనిఖీల సమయంలో నిల్వల్లో వ్యత్యాసం లేకుండా చూసుకోవాలన్నారు. భిన్నంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో రెండు మండలాల డీలర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాతపద్ధతిలోనే రేషన్ డీలర్లు ప్రజాపంపిణీ చేపట్టాలని తహసీల్దార్ సింగారావు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. డీలర్లు ప్రతినెల 1వ తేదీ నుండి 18 వరకు కార్డుదారులకు రేషన్ అందచేయాలన్నారు. ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల దుకాణం తెరిచి ఉంచి సరుకులు అందించాలన్నారు. జూన్ ఒకటి నుండి ఈ విధానం అమలులోకి వస్తున్నందున రేషన్ సాపు డీలర్లు అందుకు అనుగుణంగా పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ అర్జున్, ఆర్ఐ శ్వేత, సర్వేయర్ సురేష్, డీలర్ల సంఘం అధ్యక్షులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## వేగం.. ప్రమాదం

(5వ పేజీ తరువాయి)

చేసుకోవచ్చు. అత్యంత అప్రమత్తంగా నియమాలకు అనుగుణంగా ఉండాల్సిన ప్రయాణం కొద్దిపాటి నిర్లక్ష్యంతో విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఒకరి నిర్లక్ష్యం అన్నెం, పున్నెం ఎరుగని ఇతరుల ప్రాణాలు పోవడానికి కారణమవుతుంది. ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయేవారు కొందరైతే అవయువాలు కోల్పోయి విగత జీవులుగా మారుతున్న వారు ఎందరో ఉంటున్నారు. రోడ్డు ప్రమాదాలపై ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన వాహనదారుల తీరులో మార్పు కనబడటం లేదు. గత కొంత కాలంగా రోడ్డు ప్రమాదాలు గణనీయంగా పెరిగాయి. మృతుల్లో ఎక్కువ మంది యువకులే ఉండటం మరింత ఆందోళన కల్గించే విషయం. ఏటా రోడ్డు ప్రమాదాల బారిన పడి మృతుల సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. దీనికి తోడు ఏడాదిలో 3 శాతం ప్రమాదాలు తగ్గించాలని పెట్టుకున్న లక్ష్యాలు ప్రణాళికలకు మాత్రమే పరిమితమయ్యాయి.

**అర్బన్‌లోనే అత్యధికం**

రోడ్డు ప్రమాదాల, మృతుల విషయంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో నమోదైన గణాంకాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. మృతుల్లో మూడో వంతు అర్బన్ పరిధిలో ఉంటున్నాయి. సిబ్బంది పరంగా కొరత లేనప్పటికి ఈ స్థాయిలో ప్రమాదాలు జరగడం అంతు చిక్కని ప్రశ్నగా మారింది. ప్రధానంగా గుంటూరు నగరం, ఇతర ప్రధాన పట్టణాల్లో యువత బైక్ రేసింగ్‌లు ఎక్కువ అవుతున్నా వాటిపై నిఘా కొరవడిందని.. అందువల్లే ప్రమాదాలు, మరణాలు ఎక్కువ జరుగుతున్నాయని తెలుస్తోంది. కళాశాలలు అధికంగా ఉండటం వల్లే యువత బైక్ ప్రమాదాల బారిన పడుతున్నారని అధికారులు చెబుతున్నా నివారణ చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నామమాత్రపు తనిఖీలు, కొద్దిపాటి జరిమానాలు, తూతుమంత్రపు కౌన్సిలింగ్ వంటి చర్యలతో ఫలితాలు లేవని రుజువు అవుతున్నా అధికారుల్లో చలనం ఉండటంలేదు.

**మనకేందుకులే అనే ధోరణి**

ప్రమాదం జరిగినప్పుడు చూసిన వ్యక్తులు సమాచారం ఇవ్వడానికి ముందుకు రాకపోవడం కూడా మృతుల సంఖ్య పెరగడానికి మరో కారణం. ప్రమాదం జరిగిన తొలిగంటలో సమాచారం ఇస్తే 70 శాతం వరకు ప్రాణాలను కాపాడవచ్చు. దీనిని గోల్డెన్ అవర్ అని అంటారు. అయితే ప్రమాద సమాచారం ఇస్తే చట్టపరంగా ఏమైనా ఇబ్బందులు వస్తాయనే భయం, మనకేందుకులే అనే ధోరణి పలువురిలో ఇప్పటికీ ఉంది. ప్రమాద సమాచారం ఇచ్చిన వారికి రూ.5 వేలు నజరానా, ప్రశంసాపత్రం, చట్టప్రకారం ఇబ్బందులు లేకుండా చూడటం వంటి నియమాలు అందుబాటులోకి వచ్చినా ఎవరూ ముందుకు రావడం లేదు.

**క్షతగాత్రుల వేదన చూసి మార్పు**

రోడ్డు ప్రమాదంలో సభ్యుడిని కోల్పోయి ఆ కుటుంబం ఎంత మానసిక వేదనకు గురవుతుందనే విషయంపై జర్మనీలో విద్యార్థులను ఆయా కుటుంబాల వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. విద్యార్థులు, యువతకు ట్రాఫిక్ రూల్స్ నేర్పడంతో పాటు ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రమాదాలను నివారించవచ్చనేది వారి నమ్మకం. ఈ విధానం ద్వారా జర్మనీలో కొంత మేరకు ఫలితాలు సాధించారు.

### కబడ్డీ క్రీడాకారులకు క్రీడాదుస్తుల అందజేత



క్రీడాకారులకు క్రీడాదుస్తులు అందజేస్తున్న దాతలు

చినగంజాం, మే 24(ఆంధ్రజ్యోతి) : మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో కబడ్డీ వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు శనివారం దాతలు క్రీడాదుస్తులను అందజేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్, చినగంజాం బాలకోటేశ్వర స్పోర్ట్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో గత నెల 20వ తేదీ నుంచి కబడ్డీ వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ శిబిరంలో ప్రతి రోజూ 120 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నట్లు క్లబ్ అధ్యక్షులు, కోచ్ ఎం.గిరిబాబు తెలిపారు. వీరికి స్పోర్ట్స్ క్లబ్ సీనియర్ కబడ్డీ క్రీడాకారులు వెంకటేష్‌రెడ్డి (మడనూరు), పెదగంజాం గ్రామానికి చెందిన కోమట్ల పవన్‌కళ్యాణ్‌రెడ్డిలు తమ సొంత నిధులతో క్రీడాదుస్తులను సమకూర్చారు. దాత వెంకటేష్‌రెడ్డి, పవన్‌కళ్యాణ్‌రెడ్డి తల్లిదండ్రులు రమేష్‌రెడ్డి, రమాదేవీలు క్రీడాకారులకు క్రీడాదుస్తులను, కోచ్ గిరిబాబుకు ట్రాక్ షూట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికి తీసి, రాష్ట్ర జట్టులో ప్రాతినిధ్యం వహించే అర్హత సాధించాలన్నదే క్లబ్ ఆశయమన్నారు. కార్యక్రమంలో బీకే స్పోర్ట్స్ క్లబ్ సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

### పది రీవాల్యూ్యషన్‌లో మార్కులు మెరుగు

● షణ్ముక ప్రియకు మండల స్థాయిలో ద్వితీయ స్థానం

అద్దంకిటౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): పదివ తరగతి పరీక్షల రీవాల్యూ్యషన్‌లో అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినీకి మంచి మార్కులు సాధించింది. పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కొంగర షణ్ముక ప్రియకు గతంలో 582 మార్కులు వచ్చాయి. ప్రస్తుతం ఇంగ్లీష్ రీవాల్యూ్యషన్‌కు పెట్టుకోగా 86 మార్కుల నుంచి 96 మార్కులకు పెరిగాయి. దీంతో మొత్తం 592 మార్కులతో మండలంలో ద్వితీయ స్థానం సాధించింది. పదవ తరగతి ఫలితాలల్లో ఈ ఏడాది అద్దంకి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. మరికొంత మంది విద్యార్థులకు కూడా రీవాల్యూ్యషన్‌లో మార్కులు పెరిగినట్లు హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు.

**ధనుష్‌కు 593 మార్కులు**


పృధివి ధనుష్

పందిళ్లపల్లి(చీరాల) : పదవ తరగతి ఫలితాల రీ వాల్యూ్యషన్‌లో వేటపాలెం మండలం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పృధివి ధనుష్ 593 మార్కులు సాధించాడు. అంతకు ముందు విడుదలైన ఫలితాల్లో 589 మార్కులు రాగా, రీ వాల్యూ్యషన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈక్రమంలో తెలుగు లో నాలుగు మార్కులు అదనంగా రావడంతో పాఠశాల ఉపాధ్యాయులు ధనుష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఇప్పటికే ఈ స్కూల్ విద్యార్థిని 596 మార్కులతో రాష్ట్రంలో తృతీయ స్థానం, జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన విషయం పాఠకులకు విదితమే.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

పంగులూరు, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బైటమంజులూరు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయిన ఘటనలో ముగ్గురికి రక్తగాయాలయ్యాయి. అద్దంకి మండలం దేనువకొండ గ్రామానికి చెందిన ప్రేమసాగర్, పూర్ణమ్మ, చిన్నారి మేషక్‌లు ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేట నుండి అద్దంకి వెలుతుండగా బైటమంజులూరు సమీపంలో బైకు అదుపు తప్పడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయాలపాలైన వీరిని స్థానిక పోలీసులు హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

### బస్సు ఢీ కొని గేదె మృతి

పంగులూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైటమంజులూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై బస్సు ఢీ కొని గేదె మృతి చెందింది. శనివారం రాత్రి సమయంలో జాతీయ రహదారి దాటుతున్న గేదెల గుంపును ఒంగోలు నుండి విజయవాడ వైపు వెలుతున్న ఇంద్ర ఆర్టీసీ. బస్సు వేగంగా ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో సంఘటనా స్థలంలో ఓ గేదె మృతి చెందగా, మరో గేదె తీవ్ర గాయాలతో చావు బతుకుల మధ్య కొటుమిట్టాడుతుంది. వీహైవే పెట్రోలింగ్ సిబ్బంది క్రేన్ సాయంతో గేదెను తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు.

## పొగాకు కొనకుంటే ఆత్మహత్యలే శరణ్యం

మంత్రుల ఎదుట గోడు వెళ్లబోసుకున్న రైతులు


మంత్రులతో సమస్యను వెల్లడిస్తున్న మహిళా రైతు రమాదేవి

పర్చూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : పొగాకు కంపెనీల మాయాజాలంతో తీవ్రంగా నష్టపోయామని, తమ వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని పలు గ్రామాల రైతులు మంత్రుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు.. పొగాకు కంపెనీల మాటలు విని అప్పుచేసి మరీ వేల ఎకరాల్లో బర్లీ పొగాకును సాగు చేశామన్నారు. అయితే ప్రస్తుతం పంట చేతికి అందివచ్చినా అమ్ముకోలేని దుస్థితి నెలకొందన్నారు. నాడు సాగును ప్రోత్సహించిన కంపెనీలు నేడు కొనుగోలు చేయకుండా ముఖం చాటేస్తున్నాయన్నారు. ఇప్పుడు తమ పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని మంత్రుల ముందు రైతులు కన్నీటి పర్యంత మయ్యారు. పొగాకు రైతుల సమస్య పరిష్కారం కోసం శనివారం మార్టూరు మండలం ఇసుక దర్శి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారధ్యంతో ఆయా పొగాకు కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల సమక్షంలో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పర్చూరు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి పెద్దఎత్తున పొగాకు రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి ఆధ్యక్షతన నిర్వహించిన ముఖాముఖిలో రైతులు తమ గోడు వినిపించారు.

**జీపీఐ కంపెనీని నమ్మి మోసపోయాం**

పొగాకు కంపెనీ మాటలువిని మోసపోయాం. గత ఏడాది కొద్ది మొత్తంలో బర్లీ పొగాకును సాగుచేసుకున్నాను. అయితే ఈ ఏడాది జీపీఐ పొగాకు కంపెనీ ప్రతినిధులు మా వద్దకు వచ్చారు. ఈ ఏడాది ధర బాగా ఉంటుంది, పండించిన పంట మొత్తం మేమే కొనుగోలు చేస్తామని పదేపదే చెప్పి నమ్మబలికారు. తీరా పంట చేతికి వచ్చి అమ్ముకుందామనే సమయానికి సిబ్బంది ముఖం చాటేశారు. వారికి ఫోన్‌చేస్తే కనీసం స్పందించడం కూడాలేదు. లక్షలు రూపాయలు అప్పులు తీసుకువచ్చి సాగు చేశాం. ఇప్పుడు ఏమిచేయాలో పాలుపోవడం లేదు. **మహిళా రైతు రమాదేవి, దుద్దుకూరు**

**పొలాల వద్ద వాములు వేశాం**



పండిన బర్లీ పొగాకును కొనుగోలు లేక పొలాల్లోనే వాములుగా వేశాం, వర్షాకాలం కూడా ముంచుకు వస్తుండడంతో ఏమిచేయాలో పాలుపోవడం లేదు. పంట చేతికి వచ్చి నెలలు గడుస్తున్నాకొనే నాథుడే కరు వయ్యారు. పొగాకు కంపెనీల మయమాటలు నమ్మి నిలువునా మోసపోయాం. **సలిసం వాసుబాబు, భీమవరం**

**ఎవరికీ ఇవ్వద్దు మేమే కొంటాం.. అనిచెప్పారు**



'పొగాకు ఎంత మొత్తంలో సాగుచేసినా మొత్తం మేమే కొంటాం ఎవరికి ఇవ్వవద్దు' అని జీపీఐ కంపెనీ సిబ్బంది నాడు నమ్మబలికారు. కనీసం వారు కనిపిచడం కూడా లేదు. కంపెనీ వారి మాయమాటలు నమ్మి అధిక మొత్తంలో పొగాకు సాగు చేశాం. ఏమిచేయాలో అర్థంకావడం లేదు.

**జరుగుల హరిబాబు, రైతు దుద్దుకూరు**

ఉష్ణోగ్రత వివరాలు

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నెల్లూరు | 39.0 | 29.4 |
| కావలి | 38 | 28 |
| ఆత్మకూరు | 36 | 26 |
| ఉదయగిరి | 37 | 27 |
| కందుకూరు | 34 | 28 |

# బదిలీల్లో సాంకేతిక సమస్యలు

**• పాయింట్ల ప్రక్రియలో అవస్థలు • హెచ్‌ఎంల స్థానచలనానికి 139 దరఖాస్తులు**

నెల్లూరు(విద్య), మే 24 (ఆంధ్రజ్యోతి): బదిలీల్లో సాంకేతిక సమస్యల కారణంగా టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయ సంఘాలు గగ్గోలు పెడు తున్నాయి. రాష్ట్ర అధికారులను సంప్రదించినా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. రోజుకో సమస్యతో బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారిందని, హెల్ప్‌లైన్ నెంబర్లు కూడా పనిచేయడం లేదని వారంటున్నారు.



**• ఎడిట్ చేయబోతే మరో సమస్య**

బదిలీ దరఖాస్తులో ఏదైనా సమస్యను ఎడిట్ చేయబోతే మరో కొత్త సమస్య ఉత్పన్నమవుతోందని ఉపాధ్యాయులు అంటున్నారు. పుట్టినతేదీ మార్పు, మిగులు ఉపాధ్యాయుల పాతస్టేషన్ పాయింట్లు జీరో అని చూపిస్తున్నాయం టున్నారు. అలాగే ఎస్‌జీటీలుగా పనిచేసి డీఎస్సీ ద్వారా ఎస్‌ఏలు ఎంపిక కాబడిన ఉపాధ్యాయులకు ఎస్‌జీటీ పాయింట్లు చూపించకపోవడంతో వారు తలలు పట్టుకుంటున్నారు. 8 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి సున్నా అని చూపించడంతో వారు కంగారు పడుతున్నారు. మరోవైపు ఆన్‌లైన్ దరఖాస్తు ముగింపు గడువు దగ్గర పడుతుండడం, మరోవైపు సర్వర్లు మొరాయిస్తుండడంతో ఏమి చేయాలో తెలియక టీచర్లు తికమకపడుతున్నారు..

**• పాయింట్ల ప్రకియలో అవస్థలు**

ఉపాధ్యాయుల ముఖ్యమైన స్టేషన్ పాయింట్లకు సీలింగ్ పెట్టారు. 8 ఏళ్లకు పాయింట్లు కేటాయించి, మిగిలిన కాలాన్ని పరగణలోకి తీసుకోవడం లేదని వారంటున్నారు. దీనివల్ల కేటగిరి 3, 4లలో పనిచేసిన ఉపాధ్యాయులు ఈ సీలింగ్ విధానంతో తాము 6 నుంచి 8 పాయింట్లు కోల్పోతూ తీవ్రంగా నష్టపోతున్నామంటున్నారు. మరికొంతమంది ఉపాధ్యాయులు 2023లో బదిలీ అయ్యి ప్రస్తుత విద్యావిధానంతో హేతుబద్ధీకరణకు గురై 8 ఏళ్ల సీలింగ్ విధానంలో తిరిగి దూర ప్రాంతాలకు వెళ్లిపోతున్నామని ఆందోళన చెందుతున్నారు. అలాగే బదిలీలకు సంబంధించిన చట్టంలో ప్రిఫరెన్షియల్ కేటగిరి వారికి మోడల్ పాఠశాలల్లో రిజర్వ్ చేయాలని పేర్కొన్నారు. అయితే కొన్ని చోట్ల ఎంఈవోలు అవగాహన రాహిత్యంతో ఈ విధంగా రిజర్వ్ చేయకుండా పోస్టులు చూపించారు. దీంతో ఈ కేటగిరికి చెందిన ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. అలాగే కేటగిరి-2లో పనిచేసే కార్పొరేషన్, మున్సిపాలిటీ వారు ఎప్పటికీ ఆయా సమీప ప్రాంతాల్లోని పాఠశాలల్లోనే ఉంటున్నారని, ప్రభుత్వ, జడ్పీ యాజమాన్యాల్లో పనిచేసే వారు సుమారు 30 నుంచి వంద కిలీమీటర్ల పైగానే ప్రయాణం చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. కేటగిరి 3, 4 పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు సీలింగ్ విధానం ఎత్తివేసి న్యాయం చేయాలని కోరుతున్నారు. గతంలో కూడా 2021, 2023లలో తొలుత సీలింగ్ విధాన ప్రవేశ పెట్టినా సంఘాల నేతల విజ్ఞప్తితో దీన్ని తొలగించారని గుర్తు చేస్తున్నారు.


**• ప్రధానోపాధ్యాయుల బదిలీలకు 139 దరఖాస్తులు**

ప్రధానోపాధ్యాయుల బదిలీలకు మొత్తం 139 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. హెచ్‌ఎంలకు క్లియర్ వేకన్సీలు 69, ఐదేళ్ల పూర్తయిన ఖాళీలు 45, రీఅపోర్షన్ ఖాళీలు 28 కలిపి మొత్తం 142 ఉన్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. తొలుత వీటిని పూర్తి చేసిన అనంతరం మిగిలిన బదిలీలుంటాయని తెలిపారు. అలాగే ఎస్‌ఏలు ఆన్‌లైన్‌లో ప్రక్రియ కొనసాగుతుండగా తాజాగా ఎస్‌జీటీల దరఖాస్తుల కోలాహలం కూడా ప్రారంభమైంది. షెడ్యూల్ ప్రకారం శనివారం రాత్రికి స్కూల్ అసిస్టెంట్‌ల దరఖాస్తుల ప్రక్రియ ముగియనుంది. ఎస్‌ఏలకు సంబంధించి పాయింట్ల కేటాయింపులపై విస్తృత చర్చలు సాగుతున్నాయి.

# ఆర్‌హెచ్‌ఆర్ ఆధునికీకరణకు మోక్షం

**• రూ 5.25 కోట్ల మంజూరు**
**• త్వరలో పనుల ప్రారంభం**

అనంతసాగరం మే 24 (ఆంధ్రజ్యోతి) సోమశిల జలాశయంలో ఆర్‌హెచ్‌ఆర్ పనులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని పనులు సమగ్రంగా పూర్తిచేసేలా రూ 5.25 కోట్లు మంజూరు చేయగా, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వచ్చే కృష్ణ జలాల వాటాలో 15 టీఎంసీల నీటిని తెలుగుగంగకు విడుదల చేయాలి. ఈ కాలువ ద్వారా కండలేరుకు అక్కడి నుంచి సత్యసాయి కెనాల్ ద్వారా చెన్నై పుండీ ప్రాజెక్టుకు నీరు సరఫరా చేస్తారు. కాలక్రమేణా ఈ కాలువ తూములు మరమ్మతులకు గురికాగా రెగ్యులేటర్ గేట్లు ఎత్తాలన్నా.. దించాలన్నా సిబ్బందికి తలకు మించిన భారంగా ఉండేది. గేట్లు దించినా లీకేజీ నీరు ప్రవహిస్తూ ఉండేది. ఈ పరిస్థితులను మంత్రి ఆనం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా, స్పందించి నిధులు మంజూరు చేసింది. ఈవిషయంపై ఎస్‌ఈ వెంకట రమణారెడ్డిని వివరణ కోరగా త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


మరమ్మతులకు నోచని ఆర్‌హెచ్‌ఆర్ రెగ్యులేటర్



# ఇంటర్ విద్యాశాఖలో బదిలీలు షురూ

**• జిల్లాలో 200 మందికిపైగా స్థానచలనం**
**• నేడు తుది జాబితా విడుదల**
**• జూన్ 8లోగా ఉత్తర్వులు**

నెల్లూరు(విద్య), మే 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యాశాఖలోని టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగుల బదిలీలకు షెడ్యూల్ విడుదలైంది. ఆన్‌లైన్‌లో జూన్ 8వతేదీ వరకు బదిలీలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది కొత్తగా ప్రిన్సిపాళ్లకు, జూనియర్ లెక్చరర్లకు, వారి పనితీరు ఆధారంగా పాయింట్లను కేటాయించనున్నారు. కళాశాలల్లో ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన ప్రిన్సిపాళ్లు, జూనియర్ లెక్చరర్లు తప్పనిసరిగా బదిలీ కానున్నారు. రెండేళ్లు పూర్తయిన సిబ్బంది రిక్వస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ క్రమంలో జిల్లాలో 200మందికిపైగా స్థానచలనం కలగవచ్చు.

**• పాయింట్ల కేటాయింపులు**

బదిలీల్లో ప్రిన్సిపాళ్లకు, జూనియర్ లెక్చరర్లకు పాయింట్ల కేటాయించనున్నారు. 16శాతం హెచ్‌ఆర్‌ఏ ఉన్న కేటగిరి-ఏ ఉంటే ఏడాదికి 2 పాయింట్లు, 12శాతం హెచ్‌ఆర్‌ఏలో పని చేస్తున్న వారికి ఏడాదికి 4 పాయింట్లు, 10శాతం హెచ్‌ఆర్‌ఏలో పనిచేస్తున్న జేఎల్స్‌కు ఏడాదికి 6 పాయింట్లు, గిరిజన ప్రాంతాల్లో పనిచేసేవారికి ఏడాదికి 8 పాయింట్లు ఇస్తారు. వీరి పనితీరు ఆధారంగా బదిలీల్లో ప్రాధన్యత ఇవ్వనున్నారు. అలాగే జేఎల్స్‌కు ఆయా సబ్జెక్ట్‌లలో ఇంటర్ ఫలితాల్లో 40శాతం ఉత్తీర్ణులైతే ఎలాంటి పాయింట్లు ఉండవు. 41-60శాతం వరకు పాస్ అయితే రెండు పాయింట్లు, 61-80 శాతం వరకు 4 పాయింట్లు, 81-100 శాతానికి ఆరుపాయింట్లు కేటాయిస్తారు. అలాగే ప్రిన్సిపాళ్లకు పాయింట్లు కేటాయించనున్నారు. జిల్లాలో 23 ప్రభుత్వ కళాశాలలు ఉండగా అధ్యాపకులు, సిబ్బంది కలిపి 300 మందికి పైగా పనిచేస్తున్నారు. వీరిలో జూనియర్ లెక్చరర్లు 90 మంది ఉండగా ఇద్దరికి మాత్రం కచ్చితమైన బదిలీ జరగనుంది. అలాగే 28 మంది ప్రిన్సిపాళ్లలో 22 మంది రిక్వస్ట్ బదిలీ కోరుకుంటుండగా, నాన్ టీచింగ్ సిబ్బంది 60 మందిలో నలుగురు కచ్చితమైన బదిలీ కానున్నారు. ఐదుగురు రిక్వస్ బదిలీని కోరుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. రెగ్యులర్ బదిలీల తరువాత కాంట్రాక్ట్ లెక్చరర్లకు ఖాళీల ఆధారంగా పోస్టులను కేటాయిస్తామన్నారు.

**• నేడు తుది జాబితా విడుదల**

బదిలీల షెడ్యూల్ ప్రకారం ఆదివారం అభ్యంతరాలు పరిశీలన చేసి, తుది జాబితాను విడుదల చేస్తారు. ఈనెల 27 నుంచి 29వరకు ఖాళీల ప్రకటన, వెబ్ నమోదుకు అవకాశం కల్పించి 31న పోస్టింగ్‌ల కేటాయింపులు చేస్తారు. బదిలీలకు అర్హులైన అభ్యర్థుల జాబితాను ఇప్పటికే పోర్టల్‌లో ప్రకటించారు. అధికారులు ధ్రువీకరించిన జాబితాలో ఉన్న అభ్యర్థులు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా తమ ఎంపికలను నమోదు చేయాల్సి ఉంది. పోస్టింగ్ ఆర్డర్స్‌ను కూడా ఆన్‌లైన్‌లోనే డౌన్‌లోడ్ చేసుకుని తమకు కేటాయించిన స్థానాల్లో చేరాలని అధికారులు తెలిపారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా జరిగే ఈప్రక్రియలో బదిలీ ఉత్తర్వులు జూన్ 8లోగా జారీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2025 మే 31నాటికి ఒకే కేంద్రంలో ఐదేళ్లు పనిచేస్తే తప్పనిసరిగా బదిలీ కావాల్సిందేనని, రెండేళ్లు పూర్తయిన వారు రిక్వస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2027 మే 31వతేదీ లోగా ఉద్యోగ విరమణ చేసేవారికి బదిలీల నుంచి మినహాయింపు ఇస్తున్నారు.

# వెండి నందిపై కామాక్షితాయి విహారం


పెద్ద వెండి నందివాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చిన మల్లికార్జునస్వామి, కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం,మే24:(ఆంధ్రజ్యోతి):సాక్షాత్తు పార్వతీ పరమేశ్వరులే శనివారం పెద్ద వెండి నంది వాహనంపై ఆదిదంపతులుగా కొలువు దీరి, గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని జొన్నవాడ ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మో త్సవాల్లో భాగంగా శనివారం వెండి నందివాహనసేవ వైభవంగా జరిగింది. గ్రామోత్సవంలో భక్తులు అడుగడు గునా స్వామి,అమ్మ వార్లకు కాయాకర్పూరం సమర్పించి, మొక్కులు తీర్చు కున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి నివేద నలు సమర్పించుకున్నారు. మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారు వెండి నందిపై శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు గ్రామో త్సవంలో ఊరే గుతూ భక్తులను కటాక్షించారు. భక్తులం దరికీ నిత్యాన్న దాన సదనంలో భోజన వసతి కల్పించారు. దాతల సహ కారంతో ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమాలను ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈవో ఏవీ. శ్రీనివాసులు రెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

# అడల్ట్ బీసీజీలో మొదటి స్థానం

**• క్షయ నివారణే ధ్యేయంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కృషి**
**• గత ఏడాది మే 16న పథకం ప్రారంభం**
**• జిల్లా లక్ష్యం 5.55 లక్షలు**
**• 80 శాతం వ్యాక్సిన్ ప్రక్రియ పూర్తి**

నెల్లూరు (వైద్యం) మే 24 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నివారణే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. దీంతో జిల్లా అధికారులకు రాష్ట్ర ఉన్నతాధికారులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రాణాంతక క్షయ వ్యాధిని నివారించేందుకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ గత ఏడాది నూతన పథకాన్ని తీసుకు వచ్చాయి. ఇందులో భాగంగా 2025 చివరినాటికి క్షయను నివారించాలన్న ఉద్దేశ్యంతో 60 ఏళ్ల పైబడిన వారికి అడల్ట్ బీసీజీ (బేస్‌లెస్ కల్మిటి గూరిన్) వ్యాక్సిన్ వేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో 2024 మే 16న బీసీజీ వ్యాక్సిన్ వృద్ధులకు వేయడాన్ని ప్రారంభించారు. జిల్లాకు 5,55,054 మందికి బీసీజీ వ్యాక్సిన్ వేయాలని నిర్ణయించగా, 4,43,517 మందికి వ్యాక్సిన్ వేశారు. రాష్ట్రంలోనే నెల్లూరు జిల్లా 80 శాతం మందికి వ్యాక్సిన్ వేసి మొదటిస్థానం సంపాదించింది. రెండో స్థానంలో కర్నూలు జిల్లా నిలిచింది.


నగరంలోని కోటమిట్ట యూసీహెచ్‌సీలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

**• హర్షాతిరేకాలు**

జిల్లా వ్యాప్తంగా 52 పీహెచ్‌సీలతోపాటు 10 సీహెచ్‌సీలు, 28 యూపీహెచ్‌సీల్లో ఈ వ్యాక్సిన్ పక్రియ కొనసా గింది. జిల్లా వ్యాప్తంగా క్షయ వ్యాధిగ్రస్థులు 10వేల మందికిపైగా ఉన్నారు. అయితే వైద్య ఆరోగ్యశాఖ మాత్రం ప్రస్తుతం 1648 మంది మాత్రమే క్షయ వ్యాధిగ్రస్థులు ఉన్నట్లు పేర్కొంది. ఇందులో ప్రభుత్వ పరంగా 1050 మంది వైద్యచికిత్సలు పొందుతుండగా 592 మంది ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. బీసీజీ వ్యాక్సిన్ వేసే గడువు ఈ నెల 16తో ముగిసింది. జిల్లాలో అడల్ట్ బీసీజీ వాక్సిన్ కార్యక్ర మం విజయవంతం కావటం పట్ల అధికారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

**తొలిస్థానం రావటం ఎంతో ఆనందం**



వృద్ధులకు, క్షయ వ్యాధిగ్రస్థుల కుటుంబ సభ్యులకు వ్యాక్సిన్ వేయటంలో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలవటంపై ఎంతో ఆనందంగా ఉంది. ఇది గొప్ప అనుభూతి. దేశవ్యాప్తంగా మొదటిసారి ఈ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాయి. ప్రస్తుతం ఈ పథకం ముగిసింది. ఈ వ్యాక్సిన్‌ను అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగానే వేశాం.

\- డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా క్షయ నివారణ అధికారి

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 133 |
| స్కిన్ చికెన్ | 240 |
| స్కిన్‌లెస్ | 264 |

కోడిగుడ్ల ధర (100) : 530

**బంగారం, వెండి ధరలు**

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.9260 |
| వెండి కిలో ధర | రూ. 100,600 |
| వెండి ఒక గ్రాము | రూ.103.60 |

## వాకింగ్ ట్రాక్ బాగుంటే నడక బాగుంటుంది

బిట్రగుంట, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి నడక ఎంత ముఖ్యమో నడిచే ట్రాక్ అంతకన్నా ముఖ్యమని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బర్నాడ్ అన్నారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో క్రికెట్ క్రీడామైదానాన్ని కలుపుతూ శనివారం వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్‌లో రాళ్ళలను తొలగించి తువ్వ ఇసుకను పరిపించామన్నారు.

# రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి

● ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



వాటర్‌ప్లాంటును ప్రారంభిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషిచేస్తున్నారని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో వాటర్ ప్లాంటు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఎంపీ వేమిరెడ్డి వాటర్ ప్లాంటు కోసం షెడ్డును నిర్మించిన నరసింహారావును అభినందించారు. అనంతరం మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఎంపీ తన స్వంత నిధులు రూ.5 లక్షలతో, జనసేన మండలాధ్యక్షుడు అంగులూరి నరసిం హారావు రూ.1.50 లక్షలతో నిర్మించిన షెడ్డును, వాటర్‌ప్లాంటులోని మెషిన్‌లను ఎంపి వేమిరెడ్డి, ఎమ్మెల్యే నాగేశ్వరరావు వాటర్ ప్లాంటును ప్రారంభించి మంచినీటిని విడుదల చేశారు.

**చంద్రబాబు సహకారంతో మౌలిక వసతుల కల్పనకు కృషి : ఎమ్మెల్యే ఇంటూరి**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల సహకారంతో కందుకూరు నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెప్పారు. సేవాభావం ఉన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇప్పటికే వందలాది మందికి ట్రైసైకిళ్లు, వాటర్ ప్లాంటులు నిర్మించి ఇస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు అంగులూరి నరసింహారావు, సర్పంచు పులి రాఘవులు, తహసీల్దార్ కె శ్రీనివాసులు, ఎంపీడీఓ కె శ్రీనివాసులు, హెచ్ఎం మాధవరావు, టీడీపీ నాయకులు జి కల్పన, వంకాయలపాటి మాల్యాద్రి, జి సాంబయ్య, అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, కిలారి కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

● ఉలవపాడు: వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరేడు గ్రామంలో ఏర్పాటుచేసిన అమృతధార ఆర్వో ప్లాంట్‌ను నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు.

# అంకమ్మ ఆలయం షాపింగ్ కాంప్లెక్స్‌కు బహిరంగ వేలం

● పోటీపడ్డ పాటదారులు ● నెలకు రూ. 2.73 లక్షల ఆదాయం



వేలం పాటలను పర్యవేక్షిస్తున్న దేవదాయ శాఖ డీసీ

కందుకూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం, అద్దెలకు శనివారం నిర్వహించిన బహిరంగ వేలంలో పాటదారులు పోటీపడ్డారు. జనార్ధన స్వామి కల్యాణమండపంలో వేలంపాట నిర్వహించగా కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాల సుబ్రహ్మణ్యం, సీఐ వెంకటేశ్వరరావు నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

**నెలకు రూ. 2.73 లక్షల ఆదాయం**

దేవాదాయ శాఖ గుంటూరు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో దేవ దాయ శాఖ అధికారులు వేలం పాటలు నిర్వహించగా పాటదారులు పోటీ పడ్డారు. అంకమ్మ ఆలయ ప్రాంగణంలో కనిగిరి రోడ్డుకు అభిముఖంగా 20 రూములు, ఆర్టీసి బస్టాండ్‌లోకి వెళ్లే మార్గంకు అభిముఖంగా 4 రూములు నిర్మించేలా ప్లాన్ రూపొందించగా ఇప్పటికే అక్కడ వివిధ వ్యాపారాలు చేసుకుంటున్న వారితో పాటు ఔత్సాహిక వ్యాపారులు కూడా డిపాజిట్లు చెల్లించి పాటలో పాల్గొన్నారు. దీంతో అత్యధికంగా ఒకటవ నెంబరు షాపును నెలకు రూ. 20 వేలు అద్దె చెల్లించేందుకు ముందుకొచ్చి పాటపాడగా మిగిలిన షాపులను కూడా పోటీపడి పాడారు. దీంతో అంకమ్మ అమ్మ వారికి ప్రతిఏటా రూ. 32.7 లక్షలకు పైగా అద్దెల రూపంలో ఆదాయం రానుంది. ఈసందర్భంగా డీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పాటదారులు వారే స్వంత నిధులతో శాశ్వత గదుల నిర్మాణం చేయాల్సి ఉంటుందని, ఈ నిర్మాణం నాలుగు నెలల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యాపారాలు ప్రారంభించే సమయానికి పాటదారులు ప్రస్తుతం చెల్లించిన రిఫండబుల్ డిపాజిట్ కాక ఒక ఏడాది అద్దె ముందస్తుగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కందుకూరు గ్రామదేవత అంకమ్మ దేవాలయం ఆదాయం పెంచాలని ప్రయత్నించామే తప్ప మాకు ఎలాంటి స్వార్థం లేదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. వేలం పాటలను పర్యవేక్షిం చేందుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలయం వద్ద ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడేలా చూస్తామని ఆరునెలల్లో దేవాల యంకు ట్రస్టుబోర్డును కూడా నియమిస్తామని ఆయన తెలిపారు.

## గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారించాలి

లింగసముద్రం, మే 24 ఆంధ్రజ్యోతి): గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ గ్రామాలలో మరమ్మతులకు గురైన చేతిపంపులను, పగిలిన మంచినీటి పైపులను అధికారులు వెంటనే బాగు చేయించాలన్నారు. అనంతరం శాఖల వారీగా అధికారులు అభివృద్ధి పనులను వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ మాట్లాడుతూ మండలానికి 25 కమ్యూనిటీ సోక్‌పిట్లు మంజూరయ్యాయని, వాటిని త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. శింగరపాలెం ట్యాంకు నిర్మించి నీటిని సరఫరా చేయకుండా నిరుపయోగంగా ఉండడంతో, వెంగళాపురం ట్యాంకు నుంచి నీటిని ఆ గ్రామస్థులకు ఇస్తుండడంతో తమకు నీరు తక్కువగా సరఫరా అవుతోందని ఎర్రారెడ్డిపాలెం సర్పంచి డి మలికార్జున చెప్పారు. అలాగే ఉట్లవారిపాలెం గ్రామంలోని ట్యాంకుకు నీరు తక్కువగా వస్తోందని ఆయన చెప్పారు. తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కృష్ణయ్య చెప్పారు. అలాగే తిమ్మారెడ్డిపాలెం శ్మశాన వాటికలో చిల్లచెట్లు ఎక్కువగా ఉండడంతో గ్రామస్థులు మృతదేహాలను రోడ్డు పక్కనే ఖననం చేస్తున్నారని ఎంపీటీసీ దగ్గు వెంకటేశ్వర్లు చెప్పారు. అలాగే మాలకొండరాయునిపాలెంలో అసంపూర్తిగా నిర్మించిన సచివాలయంలో పచ్చాకు కూలీలు ఉంటున్నారని సర్పంచు వంటేల శ్రీనివాసులు చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తిచేస్తామని పీఆర్ ఏఈ శ్రీనివాసులు చెప్పారు. మరలా రాష్ట్రంలో కరోనా కేసులు వస్తున్నాయని ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డా.పి రమేష్ సూచించారు. బహిరంగ ప్రదేశాలలో మాస్కులు ధరించాలన్నారు. ఆర్ఆర్ పాలెం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని సర్పంచు సీహెచ్ అంజమ్మ కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కలిగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అందిస్తున్న మహాత్మాగాంధి జాతీయ ఉపాధి గ్రామీణ పథకం, రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో ఉద్యానశాఖ అందిస్తున్న వివిధ పథకాల రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వింజమూరు ఉద్యాన శాఖాధికారి షేక్ షాహిల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని తూర్పుగుడ్లదొన, పడమరగుడ్లదొన, ఎరుకులరెడ్డిపాలెం పంచాయతీలలో ప్రభుత్వం అందిస్తున్న పథకాల రాయితీలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. జాబ్‌కార్డు కలిగి ఐదు ఎకరముల లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులు ఉద్యాన పంటల సాగుచేపట్టుటకు, స్వల్పకాలిక పంటలైన మల్లె, గులాబి పూలతోటల పెంపకం, పశుగ్రాస పెంపకం, నీటికుంటలకు పథకాలకు ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పడమరగుడ్లదొన పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, ఉపాధిహామీ టీఏ చెన్నయ్య, ఎఫ్ఏ రమణయ్య, రైతులు పాల్గొన్నారు.

## మాలకొండ ఆదాయం రూ. 15,98,061

వలేటివారిపాలెం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 15,98,061 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవి సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 8550, కుంకుమార్చన ద్వారా రూ. 20,520, వివాహముల ద్వారా రూ. 7 వేలు, తలనీలాలు ద్వారా రూ. 78,850, వాహనపూజలు ద్వారా రూ. 4,360, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 5,66,000, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ. 640, రూముఅద్దెలు ద్వారా రూ. 33,910, కవర్లు ద్వారా రూ. 10,200, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,54,345, అన్నదానం ద్వారా రూ. 6,03,186, విరాళముల ద్వారా 10,500, ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ సాగర్‌బాబు తెలియజేశారు.

## రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

● పలువురికి గాయాలు

వలేటివారిపాలెం, మే 24 (ఆంధ్రజ్యోతి): రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో జరిగింది. ఆ ఘర్షణలో లీలమ్మ, శ్రీదేవి, వెంకట్రావు, సాయి, మనోజ్‌లతో పాటు పలువురికి గాయాలయ్యాయి. ఘర్షణలో గాయపడిన వారిని వలేటివారిపాలెం 108 వాహనంలో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పి చికిత్స చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఆ రెండు కుటుంబాల మధ్య ఘర్షణలు జరిగి ఇరువురిపై కేసులు కూడా నమోదయ్యాయి. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

## 20 మద్యం సీసాల స్వాధీనం

కలిగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్లపాడు, సిద్దన కొండూరు గ్రామాల్లో శనివారం కలిగిరి ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ దాడుల్లో 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ అబ్దుల్ జలీల్ తెలిపారు. ఇద్దరు వ్యక్తులు తమవద్ద పరిమితికి మించి మద్యం సీసాలను కలిగి ఉండటం వలన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

## లేగదూడల పోషణలో జాగ్రత్తలు పాటించాలి

కలిగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): లేగదూడల పోషణలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ విజయ్‌కుమార్ పాడిరైతులకు సూచించారు. శనివారం మండలంలోని కుమ్మరకొండూరు గ్రామంలో పాడిరైతులకు లేగదూడల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రతలు, వాటి పెంపకం తదితర అంశాలపై అవగాహన కలిగించారు. అనంతరం లేగదూడలకు పోటీలు నిర్వహించి ఆరోగ్య వంతమైన దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాసులు, ఏడీ సురేష్, గ్రామ టీడీపీ నాయకులు కాపుగొర్ల మురళి, పాడిరైతులు పాల్గొన్నారు.

## ముగిసిన ఉజ్జీవ మహాసభలు

కలిగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాలెం గ్రామంలో సెంటినరి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో జరుగుతున్న ఉజ్జీవ మహాసభలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా పాస్టర్ జయప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని సూచించారు. ఈ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నేత బంగారురెడ్డికి ఘన నివాళి

ఉలవపాడు, మే 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ ఆదర్శంగా నిలిచిన చిట్టా బంగారురెడ్డి (65) శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులు ఆయన భౌతిక కాయానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ఫుట్‌బాల్ టోర్నీ విజేతలు బిట్రగుంట జట్లు

కావలిటౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : దేవ్ మెమోరియల్ (దేవరాజ్) రెండు జిల్లాల ఫుట్‌బాల్ టోర్నీ విన్నర్స్, రన్నర్స్‌గా బిట్రగుంట జట్లు నిలిచాయి. కావలి ఫుట్‌బాల్ అసోసియేషన్ (కెఎఫ్‌సి) ఆధ్వర్యంలో జేబీ డిగ్రీ కళాశాల డీఆర్ క్రీడా ప్రాంగణంలో జరిగిన రెండు జిల్లాల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఫైనల్స్‌కు రెండు బిట్రగుంట జట్లే చేరుకోవడంతో బిట్రగుంట ఎ జట్టు విన్నర్స్‌గా బిట్రగుంట బి జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. కార్యక్రమంలో నిర్వాహకులు శేషు, రాము, ఫరూఖ్, మనోజ్, తేజ, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

## సుజనమ్మ మృతికి సంతాపం

కావలి, మే 24 (ఆంధ్రజ్యోతి): కావలి రెడ్‌క్రాస్ భవన నిర్మాణదాత, ప్రముఖ వైద్యులు చిల్లకూరు లక్ష్మీనరసారెడ్డి సతీమణి సుజనమ్మ (85) శుక్రవారం చెన్నైలో మరణించింది. దీంతో శనివారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్ బాధ్యులు సంతాప సభ నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్, రోటరీ క్లబ్ సభ్యులు నల్లూరు రవికుమార్, రెడ్‌క్రాస్ బాధ్యులు డాక్టర్ పామూరు శ్రీధర్, డాక్టర్ రమ్య, ఏవీ హనుమకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్లపడియ గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీతారాముల ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. ఆనందోత్సవాల నడుమ వసంతోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం స్వామివారిని గ్రామోత్సవంగా పారువేటకు తరలించి ఉత్సవాలకు ముగింపు పలికారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## డిపో మేనేజర్‌కు పదోన్నతి

ఉదయగిరి, మే 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్‌గా పని చేస్తున్న ఎం. శ్రీనివాసరావుకు ప్రజా రవాణా సంస్థ అధికారిగా (రీజనల్ మేనేజర్) పదోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన్ను బాపట్ల ఆర్ఎంగా నియమించారు.

## బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి, మే 24(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయ ఇన్‌చార్జి ఏపీఎంగా కృష్ణారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఏపీఎం ఖాజారంతుల్లాను డీఆర్‌డీఏ జిల్లా కార్యాలయానికి బదిలీ చేశారు. దీంతో కావలి ఏపీఎంగా పని చేస్తున్న కృష్ణారావును ఇన్‌చార్జ్‌గా నియమించడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

## డిజిటల్ అసిస్టెంట్ లేక అవస్థలు

అనంతసాగరం మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయం-1లో డిజిటల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌కు అదనపు బాధ్యతలు అప్పగించడంతో అతను రెండు పనులు చేయలేక పనులు నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం రేషన్‌కార్డుల ప్రక్రియ కొనసాగుతోంది. అధికారులు చొరవ చూపి డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించేలా చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

## లైంగిక వేధింపుల నివారణకు కఠిన చట్టాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కందుకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభ

కందుకూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపులు జరిగితే బాధ్యులకు కఠిన శిక్షలు విధించేలా చట్టాలు అమలులో ఉన్నాయని కందుకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం శోభ పేర్కొన్నారు. కందుకూరు సబ్ కోర్టులో శనివారం కార్యక్షేత్ర మహిళా లైంగిక వేధింపులు - నివారణ, నిషేధం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం. శోభ మాట్లాడుతూ పనిప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపుల గురించి, అలాంటి బాధితులకు రక్షణగా చట్టంలో ఉన్న కఠిన చట్టాల గురించి వివరించారు. కార్యక్షేత్రంలో మహిళలు వేధింపులకు గురైతే స్త్రీల సమానత్వం, స్వేచ్ఛకు భంగం కలిగినట్లే భావించటం జరుగుతుందని, ఇలాంటి ఘటనలకు బాధ్యులను కఠినంగా శిక్షించటం జరుగుతుందని తెలిపారు. ఈసందర్భంగా కఠిన చట్టాలు, ఆ చట్టాల ప్రభావంతో పడే శిక్షల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది జె వసంతలక్ష్మి, న్యాయవాదులు ఎం మనోహర్, పోకూరి కోటయ్య, ప్యారాలీగల్ వాలంటీర్లు గడ్డం వెంకటరావు, గంగుల హరిబాబు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కుబడి సర్వేలు చేయవద్దు : ఎంపీడీవో

వలేటివారిపాలెం, మే 24 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా సర్వేలు మొక్కుబడిగా చేయవద్దని ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. మండలంలోని నూకవరం గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ సర్వేలు నామమాత్రంగా చేయకుండా ప్రతి ఇంటికీ వెళ్లి చేయాలని తెలిపారు. ప్రజలు యోగా రిజిస్ట్రేషన్ చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పలు సేవల ద్వారా వచ్చిన సేవా రుసుంను డిజిటల్ అసిస్టెంట్‌లు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమచేయాలని సూచించారు.

**ఉపాధి హామీ పనుల పరిశీలన**

మండలంలోని కళవళ్లలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఏపీఓ దయాసాగర్ పరిశీలించారు. ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి తిరిగి 10 గంటల్లోపు ఇళ్లకు వెళ్లాలని కూలీలకు సూచించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని సూచించారు.

## ముందస్తు రుణ ప్రణాళికపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం శ్రీనివాసులు

ఉదయగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో పొదుపు సభ్యులకు ముందస్తు రుణ ప్రణాళికపై ఏపీఎంలు, సీసీలకు బ్యాంకు లింకేజీ డీపీఎం శ్రీనివాసులు, జిల్లా యాంకర్ పర్సన్ భాను ప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యుల జీవనోపాధుల పెంపుకు ప్రభుత్వం ముందస్తు రుణ ప్రణాళికను చేపట్టిందన్నారు. సభ్యులు ఆర్థిక, వ్యాపార, గృహావసరాల నిమిత్తం బ్యాంకుకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే నేరుగా వారి ఖాతాలకు నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. మంజూరు చేసే రుణంలో సభ్యులు 30 శాతం గృహావసరాలకు, 70 శాతం వ్యాపారానికి వినియోగించుకోవచ్చన్నారు. మండలంలో 886 గ్రూపులకు సంబంధించి ముందస్తు రుణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

## 1న యాదవ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

సంగం, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025 మార్చిలో పదో తరగతిలో 470 మార్కులకుపైగా సాధించిన యాదవ విద్యార్థులకు జూన్ 1వ తేదీన నెల్లూరులోని యాదవ భవనంలో ప్రతిభా పురస్కారోత్సవ కార్యక్రమం జరుగుతుందని యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా ఆర్థిక కార్యదర్శి పీలం సురేష్‌బాబు ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలశాఖామాత్యులు కొలుసు పార్ధసారధి, వైఈపీఏ (యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) వ్యవస్థాపకులు మాదాల వెంకటేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. 470 మార్కులకు పైగా వచ్చిన యాదవ విద్యార్థులు ఈ 9705800794, 9573105305 నెంబర్లకు తెలియజేయాలని కోరారు. అవకాశాన్ని యాదవ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# విద్యతోనే ప్రగతి సాధ్యం

నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి



విద్యార్థులకు ప్రశంసాపత్రాన్ని, నగదును అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, మే 24 ( ఆంధ్రజ్యోతి ) : విద్యతోనే ప్రగతి సాధ్యపడుతుందని, విద్యార్థులు బాగా చదువుకుని ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని నిత్యాన్నదాత, శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక అలఘనాథస్వామి కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబరచిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు రూ.3,24,500 నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆత్మకూరు, అనంతసాగరం మండలాల్లోని 21 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 14 ప్రైవేటు పాఠశాలల్లో 500 నుంచి 575 మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సహక బహుమతులు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను ప్రోత్సాహించి చేయూత అందించాలనే లక్ష్యంతో నగదు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఏడాది తన సొంత నిధులతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

## ఎన్‌కేబీసీ పరిశీలన



క్షేత్రంలో పరిశీలిస్తున్న డీఎల్‌డీఏ చైర్మన్ విజయ్‌కుమార్

కొండాపురం, మే24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలదీవి వద్ద ఉన్న జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రాన్ని డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ శనివారం సందర్శించారు. ఈసందర్భంగా క్షేత్రంలోని చెరువులు, మేతకు ఏర్పాటుచేసిన భూములను ఆయన పరిశీలించారు. క్షేత్రంలో గొర్రెలకు షెడ్లు లేవని అధికారులు ఆయన దృష్టికి తీసుకురాగా ఉన్నతాధికారులకు తెలియచేసి మంజూరుకు కృషిచేస్తానన్నారు. అలాగే క్షేత్రంలో పనిచేసే కార్మికులకు ఈపీఎఫ్ నిధులు విడుదలకాలేదని విన్నవించగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో క్షేత్ర వైద్యులు బలరామక్రిష్ణ, నాగరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 307 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 389 పొగాకు బేళ్ల అమ్మకానికి తీసుకురగా వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 307 బేళ్ల కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 82 బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200, సగటు ధర రూ.243.62గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టి ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

## డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, మే 24 (ఆంధ్రజ్యోతి) : డీసీ పల్లి పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు 573 బేళ్లను తీసుకుని రాగా, 18 కంపెనీల ప్రతి నిధులు వేలంలో పాల్గొని 400 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణా లతో 173 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ280కాగా, కనిష్ఠ ధర రూ200గా పలికినట్లు వేలం నిర్వహణాధికారి జీ.రాజ శేఖర్ తెలిపారు.

# టీడీపీ నూతన అధ్యక్షుల ఎంపిక



తుమ్మల చంద్రారెడ్డి (పట్టణ అధ్యక్షుడు)



సుంకర పెంచలచౌదరి (మండల టీడీపీ అధ్యక్షుడు)

ఆత్మకూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రి, నియోజకవర్గ ఎమ్మెల్యే ఆనం రామ నారాయణ రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు టీడీపీ నూతన అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఆత్మకూరు పట్టణ అధ్యక్షులుగా తుమ్మల చంద్రారెడ్డి, ఆత్మకూరు మండల టీడీపీ అధ్యక్షులుగా సుంకర పెంచలచౌదరి రెండోసారి ఎంపికయ్యారు. అనంతసాగరం మండల టీడీపీ అధ్యక్షులుగా మెట్టుకూరు కృష్ణారెడ్డి, ఏఎస్‌పేట మండల పార్టీ అధ్యక్షులుగా అబ్బూరి రమేష్‌నాయుడు, చేజర్ల, మర్రిపాడు, సంగం మండలాల టీడీపీ పార్టీ అధ్యక్షులుగా షేక్ సిరాజుద్దీన్, శాఖమూరి నారాయణ, బాణా శ్రీనివాసులరెడ్డిని ఎంపిక చేశారు. మండల కన్వీనర్లుగా నియమించిన రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న సీఎంవో పెంచలయ్య

ఉదయగిరి, మే 24(ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునఃప్రారంభించిన రోజే ప్రతి విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన విద్యార్థిమిత్ర కిట్లను పంపిణీ చేస్తామని సర్వశిక్షా అభియాన్ జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (సీఎంవో) కే.పెంచలయ్య అన్నారు. శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పాఠ్య పుస్తకాల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఆయన మాట్లా డుతూ జిల్లాకు 1,61,959 లక్షల బ్యాగులు రావాల్సి ఉండగా 80,000 వేలు, 7,70,888 లక్షల పాఠ్యపుస్త కాలు రావాల్సి ఉండగా 6,61,683 లక్షలు వచ్చాయన్నారు. అలాగే 1,15,548 లక్షల బెల్టులు, 8,74,740 లక్షల నోట్ పుస్తకాలు, 13,375 వేల ఆక్స్‌ఫోర్డు డిక్షనరీలు వచ్చాయన్నారు. విద్యార్థిమిత్ర కిట్లలో భాగంగా బూట్లు, యూనిఫాం రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు ఇనయితుల్లా, భోగ్యం శ్రీనివాసులు, మౌలాద్రి పాల్గొన్నారు.